తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

కరీంనగర్ - నిజామాబాద్

రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి | పెద్దపల్లి | జగిత్యాల

గురువారం 06 ఆగష్టు 2026 | పేజీలు : 8

Follow :




## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

### విద్యార్థులతో కలసి పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 05 (జనంసాక్షి ):** విద్యార్థి దశ నుండే సైబర్ మోసాలకు ఫుల్ స్టాప్ పలికి కలిసి సైబర్ సురక్షిత తెలంగాణను నిర్మిద్దాం అని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ఆగస్టు-2026 స్వాతంత్ర్య మాసోత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్ష కా తిరంగా ? సైబర్ స్వతంత్ర తెలంగాణ" సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు విద్యార్థులతో కలిసి సైబర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ మోసాల పట్ల ప్రజలను, విద్యార్థులను అప్రమత్తం చేసి,సురక్షితమైన డిజిటల్ వినియోగంపై చైతన్యం కల్పించడమే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, విద్యాసంస్థల్లో విస్తృత స్థాయిలో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసగిస్తున్నారని, అత్యాశకు లోనై వ్యక్తిగత వివరాలు,బ్యాంకు సమాచారం,ఓటీపీలు, పాస్‌వర్డ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని సూచించారు. సైబర్ నేరాల నివారణలో ప్రజల అప్రమత్తతే ప్రధాన ఆయుధమని,అవగాహన ద్వారానే సైబర్ మోసాలను సమర్థవంతంగా అరికట్ట వచ్చున్నారు. సోషల్ మీడియా,వాట్సాప్, టెలిగ్రామ్,ఇన్‌స్టాగ్రామ్ తదితర వేదికల ద్వారా వచ్చే పెట్టుబడి,జాబ్ ఆఫర్లు, ముఖ్యంగా స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్,బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో చేసే మోసాలు,డిజిటల్ అరెస్ట్ అంటూ వచ్చే ఫోన్ కాల్స్, లోన్ యాప్స్,మొదలగు మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వచ్చిన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని,సోషల్ మీడియా ద్వారా అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింకులు,స్నేహ అభ్యర్థనలకు స్పందించవద్దని,సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం ఎవరితో పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే,ముఖ్యంగా గోల్డెన్ అవర్ (మొదటి గంట)లోనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు కాల్ చేసి లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని,గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఎస్పీ తెలిపారు."సురక్ష కా తిరంగా" ప్రచార సందేశమైన అప్రమత్తంగా ఉండండి,అవగాహన పెంచుకోండి, సైబర్ సురక్షితంగా ఉండండి అనే మూడు అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు,సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లు గణేష్, నాగరాజు, జునైద్, సైబర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### కరీంనగర్ కళాకారుల ఆధ్వర్యంలో

## ఘనంగా బోనాల ఉత్సవాలు

### పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 5 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరంలోని కళాకారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ శ్రీ కొలగాని శ్రీనివాస్ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ సంప్రదాయబద్ధంగా బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో కరీంనగర్ నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో, సిరిసంపదలతో ఉండాలని మేయర్ ప్రార్థించారు. రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని, యువతకు ఉపాధి అవకాశాలు పెరగాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరి యాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచే విశిష్టమైన పండుగ అని మేయర్ పేర్కొన్నారు. కళాకారులు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయ మని అన్నారు. మన పండుగలు సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయని, భావితరా లకు సంప్రదాయాలను అందించడంలో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదని కొనియా డారు. ఈ సందర్భంగా ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు, యువకులు, కళాకారులతో



మేయర్ ఆప్యాయంగా మమేకమై వారి అభినందనలు స్వీకరించారు. సంప్రదాయ డప్పు వాయిద్యాలు, భక్తి గీతాల నడుమ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. కరీంనగర్ నగరంలో బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, మున్సిపల్ సిబ్బందికి మేయర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు, కళాకారులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించారు.

## ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ పై అప్రమత్తంగా ఉండాలి

### పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..

### సైబర్ నేరాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..

### ప్రతి ఉద్యోగికి సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలి..




**గోదావరిఖని, జనంసాక్షి :** "సురక్షా తిరంగా ? సైబర్ స్వతంత్ర తెలంగాణ" ఆగస్టు నెల సైబర్ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగం ఆధ్వర్యంలో గోదావరిఖని లోని ఇల్లందు క్లబ్‌లో సింగరేణి హెచ్‌ఓడీ అధికారులకు సైబర్ నేరాలు,స్టాక్ మరియు బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు,డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఓటీపీ?కేవైసీ మోసాలు,నకిలీ లింకుల ద్వారా జరిగే మోసాలు,కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత డీప్‌ఫేక్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సైబర్ అవగాహన పోస్టర్లను విడుదల చేసి,పాల్గొన్న వారితో సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సైబర్ భద్రత,డిజిటల్ సెక్యూరిటీ,ఆన్‌లైన్ మోసాల నివారణపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా సింగరేణి ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్ మాట్లాడుతూ,సైబర్ భద్రతపై పోలీసు శాఖ

మిగతా 7లో

## భారీ వర్షాల తర్వాత అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

### కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జనంసాక్షి):** ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల అనంతరం నీటి కలుషితం, నిల్వ నీరు, చెత్త పేరుకుపోవడం, దోమల వ్యాప్తి వంటి కారణాలతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్య రక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తాగునీటిని మరిగించి లేదా శుద్ధి చేసిన తర్వాత మాత్రమే వినియోగించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్తను నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని తెలిపారు. అలాగే కాలువలు, డ్రైనేజీలు మూసుకుపోకుండా శుభ్రంగా ఉంచడం, నిల్వ నీరు లేకుండా చూసుకొని దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే ఆహారాన్ని వీలైనంత వరకు నివారించాలని, సబ్బుతో తరచూ చేతులు కడుక్కోవడం, తడి దుస్తులను వెంటనే మార్చుకోవడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత చర్యలను పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. జ్వరం, విరేచనాలు, వాంతులు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. జిల్లాలోని



అన్ని ప్రభుత్వ శాఖలు, గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పరిశుభ్రత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని, ప్రజలు కూడా వాటిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ మోసం కేసులో మరో కీలక నిందితుడి అరెస్ట్




**కామరెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జనం సాక్షి)**కామారెడ్డి జిల్లా రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఆన్‌లైన్ బెట్టింగ్/గేమింగ్ మోసం కేసులో మరో కీలక నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలు చేపట్టిన ముమ్మర గాలింపులో ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లాకు చెందిన ముత్యాల నాయుడు అలియాస్ రొంగలి ముత్యాలు నాయుడు (36)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు రాజా స్పోర్ట్స్ మరియు ఫ్యూచర్ 9.ఏషీఏ పేరుతో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ బెట్టింగ్ వెబ్‌సైట్ల లింకులను వాట్సాప్ ద్వారా పంపించి, పెట్టుబడులు పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మించి ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుల పేర్లపై యూజర్ ఐడీలు సృష్టించి, యూపీఐ , బ్యాంకు ఖాతాలు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా డబ్బులు సేకరించి మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. నిందితుడి వద్ద నుంచి ఒక ఆపిల్ ఐఫోన్ స్వాధీనం చేసుకోగా, అందులో ఆన్‌లైన్ బెట్టింగ్ కార్యక లాపాలకు సంబంధించిన కీలక డిజిటల్ ఆధారాలు లభించినట్లు పోలీసులు వెల్లడించారు . కేసులో పరారీలో ఉన్న మిగిలిన నిందితులను గుర్తించి అరెస్ట్ చేసేందుకు దర్యాప్తు కొనసాగు తోందని, వారి బ్యాంకు లావాదేవీలు, డిజిటల్ పరికరాలు, ఆర్థిక వ్యవహారాలపై లోతుగా విచారణ చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

## అచ్చంపేట గ్రామపంచాయతీలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహణ



**నిజాంసాగర్, ఆగస్టు5(జనం సాక్షి):** జాతీయ తల్లిపాల వారోత్సవాల సంద ర్భంగా నిజాం సాగర్ మండల ంలోని అచంపేట గ్రామ పంచాయతీలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు మరియు చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత, శిశువుల సంపూర్ణ ఎదుగుదలలో తల్లిపాల పాత్ర, తల్లిపాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. జననం అనంతరం గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించాలని, మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల శిశువుకు సంపూర్ణ పోషకాహారం లభించడంతో పాటు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. అనంతరం రెండేళ్ల వరకు పోషకాహారంతో పాటు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజేశ్వరి, ఏఎన్ఎం ఆశ, బి. రోజా, విజయకుమారి, నాగమణి, రామదేవి, స్వరూప, గ్రామ సర్పంచ్ లక్ష్మయ్య తదితరులు పాల్గొని తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

## కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకులు ధర్మపురి పట్టణ ప్రజల సమస్యల గురించి పరిష్కారం చుడండి



**ధర్మపురి జగిత్యాల జిల్లా 04ఆగస్టు (జనంసాక్షి) :** ఈరోజు ధర్మపురి బిజెపి పట్టణ శాఖ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో ధర్మాపురి సమస్యలపై ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ధర్మపురి కాంగ్రెస్ మరియు బిఆర్ఎస్ నాయకులు మేడిగడ్డ బ్యారేజ్ గురించి మావల్లే సాగు నీరు వస్తుందని ఒకరు, మేమే వీటన్నిటిని నిర్మించామని మరొకరు, ఇలా ఒకరికి ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు, కానీ ఈ నాయకులకు ధర్మపురిలో ఉన్న సమస్యలకు కనిపించట్లేదు, ఇక్కడి ప్రజా సమస్యలపై గొంతెత్తని బిఆర్ఎస్ నాయకులు అలాగే అధికారంలోకి రాకముందు ఇదే బిఆర్ఎస్ నాయకుల పనితీరు గురించి ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఊరి మీది సమస్యలను పరిష్కరించకపోవడం బాధాకరం. కనుక బయటి రాజకీయాలను పక్కనపెట్టి ధర్మపురి ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడే రాజకీయాలు చేస్తే బాగుంటుందని భారతీయ జనతా పార్టీ ధర్మపురి శాఖ ఆశిస్తుంది.. ఎన్నో కోట్లు ఖర్చుపెట్టి మాత శిశు హాస్పిటల్ ఇప్పటికీ ప్రారంభం ఉత్సవానికి నోచుకోలేకపోయింది దానిని వెంటనే ప్రారంభం చేయవలసిందిగా, అలాగే కొన్ని లక్షల రూపాయలు ఖర్చు చేసి ధర్మపురీ సెంటర్ పాయింట్ లో ఉన్న కూరగాయల మార్కెట్ ను కూరగాయలు అమ్మే వారికి శాశ్వత పరిష్కారం చూపవలసిందిగా కోరుతూ అలాగే డంపింగ్ యార్డ్ అలాగే స్మశాన వాటిక పునర్నిర్మానం చేయవలసిందిగా భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తా ఉన్నది అలాగే ధర్మపురి పట్టణంలోని పెద్దపెద్ద రహదారులులో గుంతలుగా ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తున్నా వాటిని ఇప్పటివరకు సరైన రోడ్లు నిర్మాణం లేక చాలా ప్రమాదాలకు ప్రజలు గురవుతున్నారు కాబట్టి వాటి అన్నిటిని గుర్తించి వెంటనే శాశ్వత పరిష్కారం చేయవలసిందిగా భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తా ఉన్నది..ఇప్పటికైనా ఇరు పార్టీ నాయకులు జ్ఞానోదయం తెచ్చుకుని ధర్మాపురి పట్టణ సమస్యలపై పట్టణ సమస్యలను పరిష్కరించవలసిందిగా డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ ,జిల్లా కార్యదర్శి బెజ్జరపు లవన్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు సుంకు మధుసూదన్, బీజేవైఎం నాయకులు మండలోజీ సూరజ్, ఆనందాస్ నవీన్, సోమిశెట్టి శివ సాయి, పూదరి పవన్, కాసారపు వెంకటేష్, సోషల్ మీడియా ఇన్చార్జి కాశిట్టి హరీష్, మరియు తదితరులు పాల్గొన్నారు.

## హిమ్మత్ నగర్ పాఠశాలకు ఆర్థిక సహకారం అందించిన సర్పంచ్



**వీణవంక ఆగస్టు5 జనంసాక్షి)**వీణవంక మండలంలోని హిమ్మత్ నగర్ గ్రామ పాఠశాల ఎంపీ, యూపీఎస్ హిమ్మత్ నగర్ పాఠశాలకు గ్రామ సర్పంచ్ జడల శ్రీకాంత్, వీణవంక మండ లానికి చెందిన పాఠశాలలో పనిచేస్తున్న నాగవెల్లి వేణు,సీనియర్ ఉపాధ్యా యులు పాఠశాల మౌలిక వసతుల కోసం 5000 రూపాయల ఆర్థిక సహకారాన్ని ప్రధానోపా ధ్యాయులు గోనె సత్యం కు బుధవారం రోజున అందించారు. పాఠశాలకు ఆర్థిక సహ కారం అంది ంచిన నాగవల్లి వేణు, ప్రధానోపాధ్యాయులు, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలియజేశారు. గత సంవత్సరం 2025-26 కు గాను ఎంపి ,యుపిఎస్ హిమ్మత్ నగర్ పాఠశాలకు సంక్రాంతి జనవరి 26 సెలబ్రేషన్స్ కి16వేల రూపాయల ఆర్థిక సహకారాన్ని హిమ్మత్ నగర్ గ్రామ సర్పంచ్ జడల శ్రీకాంత్, అందించారు. 2000 రూపాయల విలువగల మోటారును గెల్లు రమేష్,7000 విలువ కలిగిన 30 మంది బడి పిల్లలకు కుర్చీలను రావుసాల రాము, ప్రధానోపాధ్యాయులు గోనె సత్యం 5000 రూపాయలు, ఉపాధ్యాయురాలు క్రాంతి,వెయ్యి రూపాయలు,జడల రాజు వెయ్యి రూపాయలు ఆర్థిక సహకారాన్ని పాఠశాలకు అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత,ప్రియాంక,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను ఆదుకునే బాధ్యత నాది



**హుజురాబాద్, ఆగస్టు 5 (జనం సాక్షి)** :కష్టాల్లో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్తను ఆదుకునే బాధ్యత నాది అని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణ పరిధిలోని 23 వార్డులో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వార్డ్ సభ్యులు గంధం శివరాం ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి నివాసానికి వెళ్లి 3,50,000/- విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోను కాగా వారిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ అధ్యక్షుడు తిరుపతి, వార్డ్ అధ్యక్షులు,ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సైబర్ జాగ్రుక్తా దివాస్ లో భాగంగా మేడిపల్లి పోలీస్ స్టేషన్లో యువతకు అవగాహన



మేడిపల్లి, ఆగష్టు 05 (జనంసాక్షి):జగిత్యాల జిల్లా మేడిపల్లి మండల కేంద్రంలో బుధవారం రోజున సైబర్ జగ్రూక్త దివాస్ లో భాగంగా మేడిపల్లి ఎస్సై ఎం శ్రీధర్ రెడ్డి మేడిపల్లి యువతకు సైబర్ నేరాలపై మరియు గంజాయి తీసుకోవడం వల్ల కలిగే దుష్పరి ణామాలు, ట్రాఫిక్ రూల్స్ పాటించ కపోవడం వల్ల జరిగే ప్రమాదాలు, ఇటీవల వెలువడిన పోలీస్ నోటిఫికేషన్ గురించి యువతకు క్లుప్తంగా వివరిస్తూ అవగాహనా కల్పించారు.

## అల్లీపూర్ లో తల్లిపాల వారోత్సవాలు



**రాయికల(ఆగసు5(జనంసాక్షి):**మండలంని అల్లీపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముర్రు పాల ప్రాముఖ్యత, గర్భిణీలు, బాలిం తలు పాటించాల్సిన శుభ్రత, తీసుకోవాల్సిన ఆహారం, చేయా ల్సిన వ్యాయామాలపై అవగా హన కల్పించారు. అంగ న్వాడీ కేంద్రాల్లో అందించే భోజనంలోని పోషక విలువల గురించి వివరించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్య క్రమాన్ని నిర్వహి ంచారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచ్ ఎంబారి గౌతమి వెంకటేష్, అంగన్వాడీ టీచర్స్ మేఘమాల, రమాదేవి, గంగ, శారద, రజిత వివో సంఘంసభ్యులు,పిల్లలు,మహిళలు,బాలింలు గర్భిణీలు, పాల్గొన్నారు.

### కేజీబీవీ పాఠశాలలో స్నాక్స్ ప్లేట్స్ పంపిణీ



**కథలాపూర్ ఆగస్టు 5 (జనం సాక్షి**)కథలాపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా కే జీ బీ వీ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా స్నాక్స్ ప్లేట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో డి ఈ ఓ కే.రాము, ఏం ఈ ఓ.శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ లావణ్య గ్రామ సర్పంచ్ న్యావనంది శేఖర్, ఉపసర్పంచ్ చెట్ పల్లి ప్రసాద్, వార్డ్ సభ్యులు బింగి వాణి సాయబ్, కార్యదర్శి హైమద్, టీచర్స్ పాల్గొన్నారు.

# గంజాయి మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

**గోదావరిఖని,ఆగస్టు5(జనంసాక్షి)** :గంజాయి,ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు రామగుండం పోలీస్ కమిషనరేట్ కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన 81 ఎన్‌డీపీఎస్ కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 40.173 కిలోల ఎండు గంజాయితో పాటు 26 గంజాయి మొక్కలను న్యాయ స్థానం అనుమతితో ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం ధ్వంసం చేసినట్లు తెలిపారు. న్యాయాధికారుల సమక్షంలో కేసు ప్రాపర్టీ నుంచి ఎఫ్‌ఎస్‌ఎల్ పరీక్షల కోసం నమూనాలు సేకరించిన అనంతరం, కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ కరీంనగర్ జిల్లా మాన కొండూర్ మండలం ఈదులగట్టెపల్లి గ్రామంలోని వెంకట రమణ ఇన్‌సినిరేటర్స్‌లో గంజాయిని దహనం చేసినట్లు పేర్కొన్నారు. ధ్వంసం చేసిన గంజాయి,గంజాయి మొక్కల మొత్తం విలువ సుమారు రూ.17,09,000



ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, గంజాయి,డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల నిర్మూలనపై ప్రభుత్వం అత్యంత కఠినంగా వ్యవహరి స్తోందన్నారు. అక్రమ లాభాల కోసం గంజాయి సాగు, రవాణా, నిల్వ, సరఫరా ,విక్రయాలు నిర్వహిస్తూ యువతను మత్తుకు బానిసలుగా మారుస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు స్థానిక పోలీసులు,స్పెషల్ డ్రగ్ కంట్రోల్ టీమ్స్, నార్కోటిక్ విభాగం సంయుక్తంగా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహి స్తున్నట్లు వెల్లడించారు.ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలను విక్రయి ంచినా, రవాణా చేసినా,నిల్వ ఉంచినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసు కుంటామని హెచ్చరి ంచారు. గంజాయి విక్రయించే లేదా సేవించే వారి వివ రాలను పోలీసులకు అంది ంచిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. గంజాయి వంటి మత్తు పదా ర్థాలను సేవించే వారిపైనా చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుని జైలుకు పంపిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ ,గోదావరిఖని ఏసీపీ ఎం .రమేష్, జైపూర్ ఏసీపీ ఎ. వెంకటేశ్వర్లు,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనిల్, ఎస్‌ఐ వినీత తదితరులు పాల్గొన్నారు.

# సెల్యూలైటిస్ వ్యాధి పైన అవగాహన కార్యక్రమం

**కథలాపూర్ ఆగస్టు 5 (జనం సాక్షి)** కథలాపూర్ మండలంలోని ఉప వైద్యారోగ్యాధికారి డా జైపాల్ రెడ్డి మరియు అంబారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.రచన ఆధ్వర్యంలో సెల్యూ లేటెస్ట్ వ్యాధి గురించి వైద్య మరియు ఆరోగ్య బృందం తాండ్రియాల గ్రామంలో ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి ఎనిమిది మంది అనుమానిత కేసుల నుండి బ్లడ్ స్మీర్ నమూనాలు సేకరించి పరీక్షల కోసం పంపించడమైనది. సెల్యులైటీస్ వ్యాధిగ్రస్తులను వారి ఇళ్ల వద్ద కలసి చికిత్స వివరాలను పరిశీలించి, అవసరమైన వైద్య సలహాలు అందించడ మైనది.అదేవిధంగా గ్రామంలో సెల్యులైటీస్, డెంగ్యూ, మలేరియా మరియు ఇతర సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, గాయాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స పొందడం, దోమల నివారణ చర్యలు చేపట్టడం, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్టి. డి ఎం మరియు హెచ్ ఓ. డా. జైపాల్ రెడ్డి గ్రామపంచాయతీ సిబ్బందికి ఫ్యాగింగ్, యాంటీ లార్వల్ కార్యక్రమాలు, దోమల నివారణ మందుల పిచికారీ, నిల్వ నీటి తొలగింపు, పరిసరాల పరిశుభ్రత చర్యలను మరింత ముమ్మరం చేయాలని



ఆదేశాలు జారీ చేశారు. అదనంగా ఆరోగ్య సిబ్బంది గ్రామంలో నిరంతర జ్వర నిఘా కొనసాగిస్తూ అను మానిత కేసులను వెంటనే గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించాలని సూచించారు.గ్రామంలో పరిస్థితిని వైద్య ఆరోగ్య శాఖ నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన అన్ని నివారణ, వ్యాధి నియంత్రణ మరియు చికిత్స చర్యలను కొనసాగి స్తున్నట్లు వైద్యాధి కారి డా.రచన తెలిపారు ఇట్టి కార్యక్రమంలో జిల్లా కీటకాజనిత వ్యాధుల నియంత్రణ బృందం సూపర్వైజర్ లు ఏ ఎం ఓ సత్యనారాయణ, హెచ్ ఈ ఓ. ఏ .శ్రీధర్, హెచ్ ఎస్ శ్రీనివాస్ , గ్రామ సర్పంచ్ జంగా శివాని రంజిత్, ఉపసర్పంచ్ అల్లూరి జలంధర్, కార్యదర్శి రవీందర్, అంబారిపేట ఎం పి హెచ్ ఈ ఓ. టి.శ్రీధర్, పి హెచ్ ఎన్. చంద్రకళ, ఎం ఎల్ హెచ్ పి. ఫణీంద్ర , ఏ ఎన్ ఎం శైలజ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎకో పార్క్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**రామగిరి, ఆగస్టు 05 ( జనం సాక్షి):**రామగుండం-3 ఏరియాలో అభివృద్ధి చేస్తున్న ఎకో పార్క్‌లో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి, పార్కును మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సింగరేణి ఫారెస్ట్రీ అడ్వైజర్ శ్రీ మోహన్ చంద్ర ఫర్గెన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ సుంకర మధుసూదన్‌తో కలిసి ఆయన ఎకో పార్క్‌ను పరిశీలించి, సుందరీకరణ పనుల పురోగతిని సమీక్షించారు.అనంతరం ఆర్‌జీ-3 ఏరియా నర్సరీని సందర్శించిన ఆయన, ఈ ఏడాది ప్లాంటేషన్‌కు వినియోగించే నాణ్యమైన మొక్కలను సార్టింగ్, గ్రేడింగ్ చేసి ప్రత్యేకంగా ఉంచాలని సూచించారు. మిగిలిన మొక్కలను పెద్ద సైజు బ్యాగుల్లో మార్చి, రానున్న సంవత్సరాల ప్లాంటేషన్ కార్యక్రమాలకు ఉపయోగపడేలా సంరక్షించాలని అధికారులకు తెలిపారు.ఏరియాలో కొనసాగుతున్న





ఓబీ డంప్ ప్లాంటేషన్ పనులను సీజన్‌ను సద్వినియోగం చేసుకుంటూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మొక్కలు, కూలీల రవాణాకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అప్రోచ్ రోడ్లను ఏర్పాటు చేసి పనులను వేగవంతం చేయాలని సూచించారు.ఈ పరిశీలనలో ఫారెస్ట్రీ ఏజీఎం శ్రీ బానోత్ కర్ణ, ఫారెస్ట్ అధికారిణి కుమారి మేఘన తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నర్మాల ఎగువ మానేరును సందర్శించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు



**గంభీరావుపేట ఆగస్టు 5 (జనంసాక్షి;)**గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువ మానేరు జలాశయాన్ని బుధవారం సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా గంభీరావుపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి గౌడ్, జిల్లా కార్యదర్శి గాండ్ల బాలలక్ష్మి ఆయన వెంట ఉన్నారు.ఈ సందర్భంగా సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ, నర్మాల ఎగువ మానేరులోకి సమృద్ధిగా నీరు చేరడం ఈ ప్రాంత రైతులకు శుభపరిణామమని అన్నారు. జలాశయంలో నిల్వయ్యే నీరు రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు ప్రజలకు తాగునీటి భద్రతను కూడా కల్పిస్తుందని పేర్కొన్నారు.ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని రైతులకు సూచించారు. నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. వీరి వెంట కాంగ్రెస్ నాయకులు రాజు గౌడ్, బాలకిషన్, దేశెట్టి శేఖర్, గౌరీ శంకర్, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు

## సిరిపాటి వేణుకి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలి



**జమ్మికుంట, ఆగస్ట్ (జనం సాక్షి):**జమ్మికుంట లో బేడ బుడగ జంగం తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తూర్పాటి లింగయ్య ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సభ్యులు బేడ బుడగ జంగం జనసంఘం రాష్ట్ర అధ్యక్షులు సిరిపాటి వేణుకి తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మా బేడ బుడగ జంగం సమాజం తరపున గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో విస్తృత ప్రచారం నిర్వహించి, పార్టీ విజయానికి తమ వంతు కృషి చేసినట్లు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాము.2024లో ఎస్సీ వర్గీకరణ అంశంపై గౌరవ సుప్రీంకోర్టు సానుకూల తీర్పు వెలువడిన అనంతరం, తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించిన వెంటనే రాష్ట్ర అధ్యక్షులు.సిరిపాటి వేణు యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 26 జిల్లాల్లో విలేకరుల సమావేశాలు నిర్వహించి బేడ బుడగ జంగం సమాజాన్ని మాల, మాదిగలతో కలపకుండా ప్రత్యేక ఉపవర్గంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఉద్యమాన్ని ముందుకు నడిపారు.అంతేకాకుండా రాష్ట్ర మంత్రులను పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించి బేడ బుడగ జంగం సమాజానికి ప్రత్యేక గుర్తింపు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట బేడ బుడగ సంఘం నాయకులు తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తూర్పాటి లింగయ్య, తూర్పాటి శంకర్,మోతే గంగయ్య,రుద్రాక్ష పోచయ్య,పర్వత మల్లయ్య,తూర్పాటి సమ్మయ్య,తూర్పాటి జంపయ్య,తూర్పాటి సాయిలు, తూర్పాటి సారయ్య,పస్తం సమ్మయ్య, కొండపల్లి రవి,వానరాశి వెంకటయ్య, తూర్పాటి రాజు,తూర్పాటి సారయ్య,మోతే రాజు తదితరులు పాల్గొన్నారు.

## మండలానికి ప్రజావాణి సేవలు




**భీంగల్, ఆగస్టు 5(జనం సాక్షి)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని, రాష్ట్రంలోని ప్రతి మండలంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం నిర్వహించే జిల్లా స్థాయి ప్రజావాణి కార్యక్రమంతో పాటు ప్రతి మండలంలోని ఎం.పి.డి.ఓ కార్యాలయం లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని సంబంధిత ప్రభుత్వ కార్యాలయాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఇక నుంచి మన భీంగల్ పట్టణ ఎం.పి.డి.ఓ కార్యాలయం లో ప్రతి సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రజవాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది.

## ఎగువ మానేరు జలాశయాన్ని సందర్శించిన జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి



**గంభీరావుపేట ఆగస్టు 5(జనంసాక్షి;)**రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎగువ మానేరు జలాశయాన్ని జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి సందర్శించారు. జలాశయంలోని నీటి పరిస్థితులను పరిశీలించి, ప్రస్తుత నిల్వలు, పరిసర ప్రాంతాల పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఏఎంసీ చైర్మన్ కొమ్మిశెట్టి విజయ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పర్ష హనుమాన్లు పాల్గొన్నారు. ప్రజలకు సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా జలవనరుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు వివిధ గ్రామ అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు

## గ్రామ ప్రజల సౌకర్యం భద్రతే మా ప్రాధాన్యత



**ఇల్లంతకుంట జులై 5(జనంసాక్షి)**ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామ అభివృద్ధికి మరో అడుగు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంనికి వెళ్ళే ప్రధాన రహదారి వద్ద వర్షం నీరు నిల్వడంతో స్థానికులు గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య దృష్టికి తీసుకెళ్లగా వారు తక్షణమేస్పందించి జేసీబీ సహాయంతో కాల్వ తీసి నీరు పొలాలకు మల్లించి నీరు నిల్వకుండా చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎలవేణి రమేష్, జీపివో శ్రీనివాస్, వార్డు సభ్యులు లింగంపల్లి అనిల్ కుమార్, గొడిసెల రజినీకాంత్, యూత్ సభ్యులు బట్టు అనిల్, చిట్యాల సంజిత్, బంగారి రమేష్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగమ్మ తల్లి బోనాల జాతర వేడుకలు



**మంథని, ఆగస్టు 05, (జనంసాక్షి)** : గంగమ్మ తల్లి బోనాల జాతర వేడుకలను గంగపుత్ర బెస్తలు బుధ వారం అంగర ంగ వైభవంగా ఘనంగా జరుగుప ుకున్నారు. ప్రత్యేకంగా ఆలంకరించిన పల్లకిలో శ్రీ గంగామాత విగ్రహాన్ని ఉంచి కొబ్బరి కాయ కొట్టి గంగమ్మ తల్లి బోనాల వేడుకను ప్రారంభించారు. గంగాపుత్ర బెస్తలు తమ సంప్రద్రాయ వృత్తి అయిన చేపలు పట్టే పెద్ద వలన అందంగా ఆలంకరించి ప్రదర్శి స్తుండగా, మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని ర్యాలీగా గోదావరి వరకు తరలి వెళ్లారు. ర్యాలీలో భాగంగా ప్రధాన రస్తాలో డీజే సౌండ్స్‌తో పాటు సంప్రదాయల నృత్యాలు చేయడంతో పాటు చేపలు పట్టే విధా నాలను ప్రదర్శించారు. అదే విధంగా డప్పు కళాకారులతో సైతం ప్రత్యేక నృత్యాలు చేశారు. గంగపుత్ర బెస్తలు నిర్వహించిన బోనాల వేడుకలను పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆనంతరం గోదావరి తీరం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గద్దెపై గంగమ్మ తల్లి, గౌరమ్మ, మత్స్యగిరింద్ర, చేప, తాబేలు ప్రతిమలను పెట్టి వివిధ రకాల పూలు, పసుపు, కుంకుమలతో ప్రత్యేకంగా పూజించారు .ఆనంతరం గంగ, గౌరమ్మలతో పాటు మత్స్యగిరింద, చేప, తాబేలు ప్రతిమలను గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సమర్పించిన బోనాలను గంగాపుత్రులు ప్రసాదంగా స్వీకరించడంతో పాటు సహపంక్తి భోజనాలు చేశారు. గంగమ్మ తల్లి బోనాల వేడుకల్లో మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, చల్లా నారాయణ రెడ్డిలు పాల్గొని బోనం ఎత్తు కున్నారు. ఈ సంద ర్భంగా వారు మాట ్లాడుతూ గం గమ్మ తల్లి బోనాల వేడు కలు ఇంత పెద్ద ఎత్తున జరుపు కోవడం చాలా సంతో షంగా ఉంద న్నారు, గంగమ్మ తల్లి దీవేనలు మంథని ప్రాంత ప్రజలపై, గంగపుత్రుల ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గంగాపుత్ర సంఘం నాయక గంధం వెంకటస్వామి, అంకరి ప్రకాశ్, అంబటి సతీష్, బోయిని నారాయణ, అంబటి శ్రీనివాస్,అటికేటి నరేష్, అంకరి శివమురళీ, అటికేటి కోటేష్, , జీదుల రాజేందర్, మోసం శంకర్‌లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పక్కనపెట్టి రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారు



ముస్తాబాద్ ఆగస్టు 05 (జనం సాక్షి) బీజేపీ నాయకులు అభివృద్ధి అంశాలు పక్కన పెట్టి మత విద్వేషాలను రెచ్చగొట్టే రాజకీయాలు చేస్తున్నారని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజ్జల రాజు అన్నారు. ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ భవనానికి వేసిన రంగుల వివాదం లో బీజేపీ నాయకులు చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. బుధవారం పార్టీ కార్యాలయం లో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల తో కలసి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తు జాతీయ జెండా లోని రంగులను పాకిస్తాన్ తో ముడిపెట్టడం దేశ భక్తి కాదని బీజేపీ నాయకుల కండువా లో కూడా ఆకు పచ్చ రంగు ఉందని అన్నారు రాష్ట్ర .కాంగ్రెస్ రైతుకు రెండు లక్షల రుణ మాఫీ, ఇందిరమ్మ ఇల్లు,ఉచిత విద్యుత్,ఉచిత బస్సు ప్రయాణం, రు.10 లక్షల వరకు ఉచిత వైద్యం, రైతులకు రైతు భరోసా, ఎన్నో పథకాలు అమలు చేస్తున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. త్రివర్ణ పతాకాన్ని అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన బిజెపి జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులపై, సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేయాలనీ డిమాండ్ చేశారుబి కాంగ్రెస్ పార్టీపై, కార్యకర్తలపై గాని అనుచిత వాక్యాలు చేస్తే సహించబోమని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో తాజా మాజీ ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్, మేజర్ గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ తాళ్ళ విజయ్ రెడ్డి,ఆరుట్ల మహేష్ రెడ్డి,వార్డు సభ్యులు రంజాన్ నరేష్, లీగల్ సెల్ కన్వీనర్ సారగు రాకేష్,ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు గోవర్ధన్, కొండాపూర్ యారటి కరుణాకర్,బండి శ్రీకాంత్, చాకలి బాబు,ఏద్దెండి సారుగు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

# ఘన్ముక్ల మోడల్ స్కూల్‌లో సైబర్ జాగ్రూకా్తా దివస్ కార్యక్రమంలో అవగాహన కల్పించిన



**వీణవంక ఆగస్టు 5 (జనం సాక్షి)** ఘన్ముకుల మోడల్ స్కూల్ లో సైబర్ జాగ్రూత్త దివాస్ కార్యక్రమానికి విద్యార్థులు,ఉపాధ్యాయులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న మోసాలు,ఫేక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లు, నకిలీ పెట్టుబడి యాప్‌లు,ఫిషింగ్ లింకులు,ఓటిపి బ్యాంకు వివరాలను అడిగే మోసగాళ్ల పట్ల మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని వీణవంక ఎస్ఐ ఆవుల తిరుపతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధిక లాభాలు వస్తాయని చెప్పి పెట్టుబడి ప్రకటనలు ,అపరి చితుల నుంచి వచ్చే సందేశాలు ,అనుమానాస్పద లింకులు ,నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్లు, యాప్‌లను నమ్మవద్దని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన వ్యక్తుల మాటలను నమ్మి డబ్బులు పెట్టుబడి పెట్టరాదని, ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే1930 సైబర్ హెల్ప్‌లైన్ కు ఫోన్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ ప్రోటల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే డబ్బు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు సైబర్ భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు, సురక్షితమైన సోషల్ మీడియా వినియోగం,డిజిటల్ లావాదేవీలలో పాటించాల్సిన నియమాలపై అవగాహన పొందారు. విద్యార్థులు సాంకేతికతను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ,సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచన చేశారు ఎస్ఐ ఆవుల తిరుపతి ,పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# డివిజన్ అధ్యక్షులు ఆగస్టు 15వ తారీకు లోపు డివిజన్ కమిటీలు నియమించాలి



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 5 (జనంసాక్షి) :** కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షతన జరిగిన డివిజన్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యుల సమావేశం లో అంజన్ కుమార్ మాట్లాడుతూ. బుధవారం రోజు మీటింగు ప్రధాన కారణం డివిజన్ అధ్యక్షులు, డివిజన్ కమిటీలు ఆగస్టు 15వ తారీకు లోపు పూర్తి చేసి నగర కాంగ్రెస్ కార్యాలయంలో అందజేయాలన్నారు. కమిటీలో మహిళలకు 33 శాతం ప్రాధాన్యత ఇస్తూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజిక వర్గాలతో 21 మందితో కమిటీ వేయాలి. పని విభజనలో భాగంగా 10 డివిజన్లకు ఇన్చార్జిగా నియమించడం జరుగుతుందని, వీరు ఆయా డివిజన్లోని కార్యకర్తలను డివిజన్ అధ్యక్షులను కార్యవర్గ సభ్యులను సమన్వయ పరుస్తూ బాధ్యతలు నిర్వహిస్తారు. పార్టీ పటిష్టంగా ఉంటేనే, ప్రతిష్టంగా ఉంటాం, పార్టీ మనకేం చేసిందని కాదు, పార్టీకి మనమేం చేసినామని ఆలోచించాలని , మీరందరూ నాయకులుగా ఎదగాలి, దానికోసం ప్రతి ఒక్కరు శ్రమించాలి.అధిష్టానం పార్టీ టికెట్ ఎవరికీ ఇచ్చిన అందరూ కలిసి అభ్యర్థిని గెలిపించుకోవాలి, పార్టీ మీ మీద నమ్మకంతో బాధ్యతలు ఇచ్చింది. మీ అందరి మీద గురుతరమైన బాధ్యత ఉందని, డివిజన్ ప్రెసిడెంట్లు, కార్యవర్గ సభ్యులు వరుసగా మూడు కార్యక్రమాలకు హాజరు కాకపోతే వారిని పదవుల నుండి తొలగించడం జరుగుతుందని, సర్ కార్యక్రమంలో భాగంగా దీన్ని ప్రతి ఒక్కరు ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అర్హులైన ప్రతి ఒక్క ఓటరును ఎన్రోల్ చేయించాలని, అనార్హులైన ఓటర్లను తొలగించే వరకు పోరాడాలి ఇది మీ బాధ్యత అని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు ఈ పర్వత మల్లేశం, కాంతాల జగన్ రెడ్డి, మడుపు మోహన్, కామ్ రెడ్డి రామ్ రెడ్డి, వంగల విద్యాసాగర్, గంట కళ్యాణి, మూల రవీందర్ రెడ్డి, నేహాల్, ఇమ్రాన్, కిమ్ ఫహాద్ ,కోడూరు రవీందర్ గౌడ్, దన్న సింగ్, కుంభాల రాజకుమార్, కలీముద్దీన్, రేగొండ సందీప్, పొన్నం మధు, అమేర్,వసీం,సరిల్ల రతన్ రాజు, మిరియాల రవీందర్ రెడ్డి, మూల జైపాల్, లైక్, గడప అజయ్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, కొలగాని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు



**చొప్పదండి,ఆగస్టు5(జనంసాక్షి):** హైదరాబాదులోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల ఆరవ తేదీన తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించే సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ ,పార్లమెంట్ ఇంచార్జ్ లింగంపల్లి నాగరాజు లు పిలుపునిచ్చారు. చోప్పదండి పట్టణంలో చోప్పదండి తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇంచార్జి మ్యాకల తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ రక్షణ సేన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం లో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చోప్పదండి నియోజకవర్గం నుండి భారీ ఎత్తున అన్ని వర్గాల నుండి ప్రజలు తరలివచ్చి సంకల్పసభను విజయవంతం చేయాలని అన్నారు. సామాజిక తెలంగాణ సాధించుకునడమే లక్ష్యంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ కవితక్క నాయకత్వం పనిచేస్తుందని వారు అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా ఏస్టి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, జిల్లా సీనియర్ నాయకులు బుడిగే పర్శారాంగౌడ్,జిల్లా సీనియర్ నాయకులు చంటి శ్రీనివాస్, పిట్టల సత్యం,నియోజకవర్గ నాయకులు మ్యాక వినోద్, పుల్ల మహేష్,నియోజకవర్గ మైనారిటీ నాయకులు బసీరీద్దీన్,నరసయ్య, మండల నాయకులు లంక అజయ్, భోడా రాకేశ్ రేడ్డి,లింగం పేల్లి శ్రీనివాస్, మరియు ఖలీద్,భూపతి మహేష్, అజీజ్, కైపు, సిరికోండ చందు,శీవ,ఒంపీ,కూమార్, శీవ,జగదీష్, శ్రీనివాస్, మల్లేశం, రాజు తదితరులు పాల్గొన్నారు.

# భగత్ నగర్ పోచమ్మ తల్లి బోనాల



కరీంనగర్ అర్బన్, ఆగస్టు 5 (జనంసాక్షి) :కరీంనగర్ నగరంలోని భగత్ నగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్న "పోచమ్మ తల్లి బోనాల పండుగ" కరపత్రాలను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను భగత్ నగర్ మున్నూరు కాపు కుల బాంధవులు ఐకమత్యంగా నిర్వహించుకోవడం ఎంతో అభినందనీయమన్నారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో భగత్ నగర్ ప్రాంత ప్రజలతో పాటు కరీంనగర్ నగర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ బోనాల ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 9న ఆదివారం రోజు భగత్ నగర్‌లో బోనాల పండుగ జరుపబడుతుందని తెలిపారు. ఉదయం 10-00 గంటలకు బోనాల శోభాయాత్ర ప్రారంభమై, భగత్ నగర్ సిడ బ్ల్యాసి గోదాంలోని పోచమ్మ దేవాల యానికి చేరుకుం టుందని, అక్కడ పట్టం వేసి బోనాలు చెల్లించడం జరుగుతుందని వివరించారు. ఈ పాంప్లెట్ ఆవిష్కరణ కార్యక్ర మంలో భగత్ నగర్ మున్నూరు కాపు సంక్షేమ సంఘం బాధ్యులు మెంగనీ వెంకన్న, తోట వెంకట రాములు, రుద్ర ఆంజనేయులు ,గంప మొండయ్య, వంగ సుధాకర్, కర్ర సత్యం, పెంట వీరయ్య, బరిగల తిరుపతి, వాసాల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలకు శుద్ధ జలనీటి యంత్రం వితరణ చేసిన డబ్ల్యూ.డీ.డబ్ల్యూ.ఎస్



**గంగాధర ఆగస్టు 05(జనంసాక్షి )** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్త్రీ అభివృద్ధి సంక్షేమ సంస్థ డబ్ల్యూ.డీ.డబ్ల్యూ.ఎస్ కరీంనగర్ వారు శుద్ధ జలనీటి యంత్రాన్ని వితరణ చేశారు. ఈ సందర్భంగా ఉమెన్ డెవలప్మెంట్ సంక్షేమ సంస్థ ప్రధాన కార్యదర్శి జమునారాణి మాట్లాడుతూ తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా శుద్ధజల నీటి యంత్రాలను పంపిణీ చేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిత మాట్లాడుతూ డబ్ల్యూ.డి.డబ్ల్యూ.ఎస్. సంస్థ తమ పాఠశాలకు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ను అందజేసినందుకు సంస్థను అభినందిస్తూ, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూ.డి.డబ్ల్యూ.ఎస్ కరీంనగర్ సంస్థ ప్రధాన కార్యదర్శి జమునారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత కుమారి, సంస్థ ప్రతినిధులు ప్రవీణ్, కొము రోజు కృష్ణ,ఫిజికల్ డైరెక్టర్ బాబు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రఘురాం ఎస్ శ్రీనివాస్, సంపత్ రెడ్డి, లక్ష్మణ్,ఈశ్వర్, రామానుజ చారి, కవిత,రాజేశ్వరి, ప్రతిభ,పూర్ణిమ, రేణుక,పద్మ.లింగయ్య పాల్గొన్నారు.

# సుందరగిరి విద్యార్థులకు 20వేల విలువైన డిక్షనరీలు,లైబ్రరీ పుస్తకాలు అందజేత



**చిగురుమామిడి ఆగస్టు 05 (జనంసాక్షి):**మండలంలోని సుందరగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు బుధవారం 20,000రూపాయల విలువైన డిక్షనరీలు,లైబ్రరీ పుస్తకాలను అదే గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ దేవులపల్లి భద్రయ్య కుమారుడు సాఫ్ట్ వేర్ ఉద్యోగి దేవులపల్లి వినయ్ ప్రసాద్ బుధవారం ఉచితంగా పంపిణీ చేశారు.అనంతరం వినయ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు .మన ఊరి పిల్లలు భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీస్,ఆర్డీవో, ఎమ్మార్వో,ఎంపీడీఓ లాంటి ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలను సాధించి, సమాజానికి సేవ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు,రాబోయే రోజుల్లో పాఠశాలలో ఒక 'డిజిటల్ లైబ్రరీ'ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఉన్నట్లు ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో టాటా ఏఐఏ కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్ కాశబోయిన వీరాస్వామీ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహి ంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు,ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## మాతృత్వం మహిళకు దేవుడిచ్చిన వరం




**బోధన్, ఆగస్టు 5 ( జనంసాక్షి ) :** అమ్మ పాలు అమృతంతో సమానమని, మాతృత్వం మహిళకు దేవుడిచ్చిన వరమని బోధన్ మండలం హంగర్గ సర్పంచ్ ఇస్మాయిల్ ఖాన్ అన్నారు. బుధవారం హంగర్గ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను అంగన్వాడి టీచర్ల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిడ్డ పుట్టిన అరగంటలోప్పే తల్లులకు పచ్చి పాలను ఖచ్చితంగా బిడ్డలకు పట్టించాలన్నారు. శిశువులకు అవసరమయ్యే పోషకాలన్నీ తల్లిపాలలో పుష్కలంగా ఉంటాయన్నారు. ముర్రు పాలను అందించడం ద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తితో పాటు విటమిన్లు, ప్రొటీన్లు అందుతాయన్నారు. తల్లి పాలు తాగే పిల్లలకు శ్వాసకోశ వ్యాధులు, జీర్ణ కోశ వ్యాధులు, చర్మ వ్యాదులు, చెవి సమస్యలు దరిచేరవన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల అందం పాడు అవుతుందనే అపోహ తొలగి బిడ్డకు పాలు అందించాలని సర్పంచ్ ఇస్మాయిల్ ఖాన్ కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుతో పాటు ఉప సర్పంచ్ సైదుద్దీన్, పంచాయతీ కార్యదర్శి షేక్ జహీర్, వార్డు మెంబర్ ఫర్హానా బేగం, అంగన్వాడి టీచర్లు బి సరిత, మహమ్మదీ బేగం, ఆయాలు వినోద, సంగీత, ఆశా వర్కర్ నంద, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

## లాంగ్‌వాల్ పనులు గడువులోగా పూర్తి చేయాలి



**రామగిరి, ఆగస్టు 5 (జనంసాక్షి):** సింగరేణి అడ్రియాల లాంగ్‌వాల్ గనిలో చేపట్టిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, భద్రత తో కూడిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి. సూర్యనారాయణ అధికారులను ఆదేశించారు.బుధవారం ఆయన అడ్రియాల లాంగ్‌వాల్ గనిని సందర్శించి, కొనసాగుతున్న పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, లాంగ్‌వాల్ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు చేపడుతున్న చర్యలను వివరించారు.అనంతరం డైరెక్టర్ (ఆపరేషన్స్) లాంగ్‌వాల్ మూడో ప్యానెల్ సాల్వేజింగ్ పనుల పురోగతి, నాలుగో ప్యానెల్ తయారీ పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, అవసరమైన జాగ్రత్తలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని సూచించారు.తదుపరి గనిలోకి వెళ్లి పాత లాంగ్‌వాల్ సాల్వేజింగ్ పనులతో పాటు నూతన ప్యానెల్‌లో జరుగుతున్న పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. లాంగ్‌వాల్ సాల్వేజింగ్ పనులను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా నిర్ణీత గడువులో పూర్తి చేసి, లాంగ్‌వాల్ నుంచి సురక్షితమైన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో రామగుండం--3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, రామగుండం--2 ఏరియా జనరల్ మేనేజర్ టి. లక్ష్మీపతి గౌడ్, ఏరియా ఇంజనీర్ వి. దూప్ సింగ్, ప్రాజెక్ట్ ఆఫీసర్ కె. జనార్దన్, ప్రాజెక్ట్ ఇంజనీర్ టి. రఘురాం, మేనేజర్ పెంచలయ్య, సర్వే అధికారి హన్మండ్లు తదితర అధికారులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు



**చొప్పదండి, ఆగస్టు 5 (జనం సాక్షి )** మండల కేంద్రంలో తెలంగాణ వీరయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గౌడ సంఘం, గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు ,మున్సిపల్ చైర్ పర్సన్ వద్దూరి సరితలకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని ఇప్పనపల్లి హరికిషన్ హైస్కూల్ గేట్ కు ఎదురుగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ముందుగా చొప్పదండి ఎంపీడీవో కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నీ కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ వద్లూరి సరిత శ్రీనివాస్,మున్సిపల్ కమిషనర్ కే .నాగరాజు లకు వినతి పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం పట్టణంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా పట్టణ సుందరీకరణతో పాటు చారిత్రక ప్రాముఖ్యత ఉన్న తెలంగాణ సాయుధ పోరాట యోధుడు సర్వాయి పాపన్న గౌడ్ త్యాగం, పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శప్రాయమని, భవిష్యత్ తరాలకు ఆయన చరిత్ర తెలిసేలా విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు బుర్ర మల్లేశం గౌడ్, మాజీ గౌడ సంఘం అధ్యక్షుడు పెరు మండ్ల గంగయ్య, యువ జన సం ఘం అధ్యక్షులు బోడిగే సాయికృష్ణ , నాయకులు ముద్దం తిరుపతి, బోడిగే శ్రీనివాస్, బోడిగే వెంకటేష్, బత్తిని శంకరయ్య, ఆరెల్లి తిరుపతి, యువజన సంఘం సభ్యులు, గౌడ కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో నేటి నుంచి సీపీఐ 9 రోజుల ప్రచార జాతా



**కరీంనగర్ టౌన్, ఆగస్టు5,(జనంసాక్షి)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు సీపీఐ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి 14వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు ప్రచార జాతా నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు.బుధవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ప్రచార జాతాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సీపీఐ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. నేటి నుంచి కరీంనగర్ పద్మనగర్‌లో ప్రారంభమయ్యే ప్రచార జాతాకు సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడిందన్నారు. నిరుద్యోగం పెరుగుతోందని, పేదలకు విద్యా, వైద్య సేవలు అందడం లేదని, రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికుల హక్కులను హరించే విధానాలు అమలు చేస్తున్నారని, మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడంలో కూడా ఆలస్యం చేస్తోందని విమర్శించారు.ఈ అంశాలన్నింటిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా తొమ్మిది రోజుల ప్రచార జాతా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, చొక్కల శ్రీశైలం, గోవిందుల రవి, లంకదాసరి కల్యాణ్, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

# గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ



**గంభీరావుపేట ఆగస్టు 05 (జనం సాక్షి);** రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించే క్రమంలో ఈ తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్ వ్యవస్థ అమలు, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లపై నిఘా తదితర అంశాలను సమీక్షించారు. అలాగే స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, ప్రజలకు అందుతున్న సేవల



నాణ్యతపై ఆరా తీశారు.అనంతరం అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మరింత వేగవంతమైన సేవలు అందించేందుకు డయల్ 100 స్థానంలో అమల్లోకి వచ్చిన డయల్ 112 అత్యవసర సేవలపై గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరూ అత్యవసర సమయంలో డయల్ 112ను వినియోగించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు.ప్రజా ఫిర్యాదులపై ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని, ప్రజలకు భద్రతాభావం కల్పించడంలో విజిబుల్ పోలీసింగ్ కీలకమని పేర్కొన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి సమాచారం కలిగి ఉండాలని, గ్రామాల్లో ఎలాంటి సంఘటన జరిగినా వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు.రాత్రి వేళల్లో గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాలని, పెట్రోలింగ్ సమయంలో రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అనుమానిత వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టాలని సూచించారు.అలాగే స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్, ఇతర నిషేధిత మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

# ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ పై అప్రమత్తంగా ఉండాలి

## పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..



చేపట్టిన ఈ అవగాహన కార్యక్రమం అత్యంత సమయోచితమైందని అన్నారు. కార్యక్రమంలో అందించిన సూచనలను సంస్థ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి చేరేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు.ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఎవరి ముఖచిత్రం, స్వరాన్నైనా పోలి ఉండే వీడియోలు, ఆడియోలు సులభంగా సృష్టించే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు, స్నేహితులు లేదా బంధువుల పేరుతో వీడియో కాల్స్, వాయిస్ కాల్స్, సోషల్ మీడియా సందేశాలు వచ్చినా వెంటనే నమ్మకుండా వాటి నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. స్నేహితుల సోషల్ మీడియా ఖాతాలు లేదా వాట్సాప్ ద్వారా అత్యవసరంగా డబ్బు పంపాలని వచ్చే సందేశాలను నమ్మి చాలామంది మోసపోయారని, భవిష్యత్తులో ఇటువంటి మోసాలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు.ప్రతి అధికారి ముందుగా సైబర్ మోసాలపై అవగాహన పెంచుకుని,తమ ఆధ్వర్యంలోని ఉద్యోగులకు కూడా నిరంతరం అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ప్రతి విభాగంలో సైబర్ భద్రతపై చర్చలు నిర్వహించడం ద్వారా మోసాలను గణనీయంగా నివారించవచ్చని పేర్కొంటూ,ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పోలీసు శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా సైబర్ భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఈసారి ముఖ్యంగా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.ప్రస్తుతం నమోదవుతున్న సైబర్ నేరాల్లో దాదాపు30 శాతం ఇన్వెస్ట్‌మెంట్ మోసాలేనని,పొదుపు చేసిన డబ్బును పెట్టుబడిగా పెట్టాలనుకునే ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, ఆర్థికంగా స్థిరపడిన వారినే సైబర్ నేరగాళ్లు ప్రధానంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజల వ్యక్తిగత వివరాలు,ఆన్‌లైన్ అలవాట్లు,సోషల్ మీడియా వినియోగం, ఇంటర్నెట్‌లో చేసే శోధనలను విశ్లేషించి వారి మనస్తత్వానికి అనుగుణంగా ఆకర్షణీయమైన ప్రకటనలు,పెట్టుబడి అవకాశాల పేరుతో ఉచ్చులోకి దింపుతున్నారని హెచ్చరించారు. వేల మందిని సంప్రదించినా ఒక్కరు మోసపోయినా నేరగాళ్లకు భారీ లాభాలు వస్తాయని తెలిపారు. బ్యాంకు లో డబ్బు ఉండటం మాత్రమే భద్రత కాదని,ఆన్‌లైన్‌లో ప్రతి అడుగులోనూ అప్రమత్తంగా ఉండటమే నిజమైన భద్రత అని స్పష్టం చేశారు.అధిక లాభాల హామీలు,తెలియని లింకులు, అనుమానాస్పద యాప్‌లు,పెట్టుబడి ఆహ్వానాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా "ఈ విషయం ఎవరికీ చెప్పొద్దు" అని చెబితే అది సైబర్ మోసానికి పెద్ద హెచ్చరికగా భావించాలని అన్నారు.అలాంటి పరిస్థితుల్లో వెంటనే కుటుంబ సభ్యులు, సహచరులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.సైబర్ మోసానికి గురైనట్లు అనుమానం వచ్చినా, డబ్బు నష్టం జరిగినా లేదా జరగకపోయినా వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. త్వరితగతిన ఫిర్యాదు చేస్తే సంబంధిత బ్యాంకు ఖాతాలు, ఫోన్ నంబర్లపై చర్యలు తీసుకుని నేరగాళ్లను గుర్తించే అవకాశం పెరుగుతుందని తెలిపారు.సైబర్ నేరాల సమాచారాన్ని దాచిపెట్టకుండా పోలీసులకు తెలియజేయడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.

ప్రతి కార్యాలయంలో అధికారులు, హెచ్‌ఆర్ విభాగాలు తమ ఉద్యోగులకు తరచూ సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఐదు నిమిషాల అవగాహన కూడా అనేక కుటుంబాలను సైబర్ మోసాల నుంచి రక్షించగలదని తెలిపారు.ప్రజలు, సంస్థలు,పోలీసు శాఖ పరస్పర సహకారంతో విశ్వసనీయ సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే సైబర్ నేరాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని,గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సైబర్ నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు.సైబర్ భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదు,ప్రతి పౌరుడి బాధ్యత. అప్రమత్తతే సైబర్ మోసాలకు శాశ్వత నివారణ అని పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి. రామ్‌రెడ్డి,ఆర్జీ-1 జీఎం లలిత్ కుమార్, రామగుండం సైబర్ క్రైమ్ ఏసీపీ రంగారెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అఫ్జల్, రామగుండం సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్,రాణా ప్రతాప్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు,సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు మారుతి, క్రాంతి,సింగరేణి హెచ్‌ఓడీ అధికారులు, సైబర్ క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజలకు మరింత చేరువగా ప్రజావాణి




**ముస్తా బాద్ ఆగస్టు 05 (జనంసాక్షి)**

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరిం చేందుకు ప్రభుత్వం ప్రజావాణి కార్యక్ర మాన్ని మండల స్థాయికి కూడా తీసు కొచ్చింది, ఇప్పటి వరకు రాష్ట్ర, జిల్లా, రెవెన్యూ, డివిజన్ స్థాయిల్లో మాత్రమే కొనసాగుతున్న ప్రజావాణి ఇకనుంచి ప్రతి మండల కేంద్రం లోనూ జరగనుంది,ఇకపై ప్రతి సోమవా రం ఉదయం 10. గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మం డల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి ప్రజా వాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని

ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు.ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, వేగవంతమైన పరి ష్కారమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబడింది. స్థానిక సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్,వైద్య అధికారి, సంక్షేమ అధికారులు, విద్యుత్ నీటిపారు దల, ఆర్‌డబ్ల్యూఎస్, రోడ్లుభవనాలు, అటవీ శాఖలతో పాటు ఇతర అన్ని ముఖ్య శాఖలకు చెందిన దాదాపు 23 రకాల మండల స్థాయి అధికారులం దరూ తప్పనిసరిగా ఈ సమావేశంలో పాల్గొనాలని స్పష్టం చేశారు.ఇప్పటివరకు ప్రజలు చిన్నచిన్న సమస్య లు, భూ సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు లేదా స్థానిక మౌలిక వసతుల దరఖాస్తుల కోసం జిల్లా కలెక్టరేట్లకు వెళ్లాల్సి వచ్చేది. మండల స్థాయిలోనే ఈ వేదిక అందు బాటులోకి రావడం వల్ల గ్రామీణ ప్రజలకు ప్రయాణ భారం, సమయం, ఆర్థిక ఖర్చులు తగ్గుతాయి. అర్జీల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ లేదా రిజిస్టర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, వచ్చి న ప్రతి దరఖాస్తుకు నిర్ణీత కాలపరిమితి లో పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టనున్నారు. తద్వారా జవాబు దారీతనం పెరిగి, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు ప్రజలకు పారదర్శ కంగా అందుతాయి.



# జలవనరుల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి: కేకే మహేందర్ రెడ్డి

### ○ఎగువ మానేరు జలాశయాన్ని సందర్శించిన జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి
### ○వెంట ఏఎంసీ చైర్మన్ కొమ్మిశెట్టి విజయ, సీనియర్ నాయకుడు పర్ష హనుమాన్లు

**గంభీరావుపేట ఆగస్టు 5 జనంసాక్షి;** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎగువ మానేరు జలాశయాన్ని జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి సందర్శించారు. జలాశయం లోని నీటి పరిస్థితులను పరిశీలించి, ప్రస్తుత నిల్వలు, పరిసర ప్రాంతాల పరిస్థితులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయనతో పాటు ఏఎంసీ చైర్మన్ కొమ్మిశెట్టి విజయ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పర్ష హనుమాన్లు పాల్గొన్నారు. ప్రజలకు సాగు, తాగునీటి అవసరాల దృష్ట్యా జలవనరుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులతో పాటు వివిధ గ్రామ అధ్యక్షులు పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు



## అప్పుల బాధతో ఆత్మహత్య

**సారంగాపూర్ ఆగస్టు 5 జనంసాక్షి;** మండలంలోని గణేష్ పల్లి,పోతారం గ్రామానికి చెందిన యాకసిరి సుబ్రహ్మణ్యం, 29 సంవత్సరాల వయస్సు అను నతడు అప్పులు ఎక్కువ అయ్యాయని ఆగష్టు 3వ తేదీన రాత్రి అందాద 10 గంటలకు గడ్డి మందు తాగడం వల్ల అతని కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేపిస్తుండగ, ఆగష్టు 5 బుధవారం ఉదయం అందాద 4.00 గంటలకు డాక్టర్లు సుబ్రమణ్యం చనిపోయినట్లు తెలిపినారు అని అతని భార్య యాకసిరి గంగజల సారంగపూర్ పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేయగ, సారంగాపూర్ ఎస్. ఐ పీ. గీత గారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గా తెలిపినారు..మృతుడు యాకసిరి సుబ్రహ్మణ్యం,బ/నీ ప్రసాద్ యొక్క కళ్ళను ఎల్.వి.ప్రసాద్ కంటి దవాఖాన యొక్క ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రవీణ్ కు సారంగాపూర్ ఎస్. ఐ., పి. గీత, కానిస్టేబుల్ వెంకటేష్, ఫోరెన్సిక్ డాక్టర్ శ్రీనివాస్ గార్ల ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులు మృతుడి కళ్ళను ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి డొనేషన్ చేసినారు.

## కార్మిక సమస్యల పరిష్కారంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు విఫలం

### టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్



కార్మిక సమస్యల పరిష్కారంలో గుర్తింపు పొందిన కార్మిక సంఘాలు పూర్తిగా విఫలమయ్యాయని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ( టీబీజీకేఎస్) ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ విమర్శించారు.ఈ సందర్భంగా వకీల్‌పల్లి గనిని సందర్శించిన ఆయనకు కార్మికులు పలు సమస్యలను వివరించారు. గనిలో గ్లౌజులు, డ్రిల్ బిట్స్, రాడ్లు, సేఫ్టీ షూస్ తదితర పనిముట్లు, భద్రతా సామగ్రి కొరత తీవ్రంగా ఉందని, దీంతో విధుల నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు తెలిపారు.అలాగే 244 మంది కార్మికులకు సంబంధించిన 4,838 మాస్టర్ల అండర్‌గ్రౌండ్ అలవెన్స్‌లో రూ.1,000 నుంచి రూ.5,000 వరకు రికవరీ చేస్తున్నారని, గత ఏడాది కూడా ఇదే విధంగా రికవరీ చేయడం వల్ల కార్మికులకు ఆర్థిక నష్టం కలిగిందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఆర్‌వో ప్లాంట్ పనిచేయకపోవడంతో శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కార్మికులు తెలిపారు.కార్మికులు ప్రస్తావించిన అన్ని సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి వెంకటేశం, నాయకులు రవితేజ, శ్రీనివాస్, రాజు, అరవింద్, మనోజ్, రామ్‌చరణ్, ప్రదీప్, రాకేష్, సంతోష్, వివేక్, గిరిధర్‌తో పాటు కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.



## కమాన్‌పూర్‌లో కుక్కలు, కోతుల బెడద..

## సమస్య పరిష్కారానికి ఎంపీడీవో హామీ

**కమాన్‌పూర్, ఆగస్టు 05, (జనంసాక్షి) :**

పెద్దపల్లి జిల్లాకమాన్‌పూర్ మండలంలో వీధి కుక్కలు, కోతుల సంచారం పెరగడంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. బుధవారం రెండు వేర్వేరు ఘటనల్లో కుక్కలు ద్విచక్రవాహనాలకు అడ్డుగా రావడంతో వాహనదారులు కిందపడిపోయి గాయపడ్డారు. మరో ఘటనలో ఎండి సమీర్ నాలుగేళ్ల కుమారుడిపై కుక్క దాడి చేయడంతో బాలుడి ముఖానికి గాయాలయ్యాయి. అలాగే మండల కేంద్రానికి చెందిన మంథని నరేష్‌పై కోతులు దాడి చేసి కరిచాయి. ఈ ఘటనల నేపథ్యంలో స్పందించిన కమాన్‌పూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, కమాన్‌పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. వీధి కుక్కలు, కోతుల సమస్య ఒక్క గ్రామానికే పరిమితం కాకుండా, మండల వ్యాప్తంగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. ఈ సమస్యను మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సాదినేని ప్రియాంక దృష్టికి తీసుకెళ్లి చర్చించినట్లు వెల్లడించారు.ఎంపీడీవో సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ వీధి కుక్కల నియంత్రణ, కోతుల బెడద నివారణకు తగిన చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత శాఖలను కోరినట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చిన్నారులు ఒంటరిగా బయట తిరగకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రజాప్రతినిధులు సూచించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా: వొడితల ప్రణవ్

**- ప్రతి గడపకు సంక్షేమం,ప్రజల వద్దకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం.**

**- ఉదయం నుండి సాయంత్రం వరకు కొనసాగిన చెక్కుల పంపిణీ..**

**- పట్టణాల్లో గడప,గడపకు ఘన స్వాగతం పలికిన లబ్ధిదారులు..**

అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కాంగ్రెస్ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తామని,సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన పేద ప్రజలకు ఆర్థిక సహాయం నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.బుధవారం రోజున హుజురాబాద్ పట్టణ పరిధిలోని 14,12,25,13,01,02,03, 04,18,05,06, 20,28,22,23,08,09,10 వార్డుల్లో 31మంది లబ్ధిదారులకు 13 లక్షల విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను నేరుగా కాంగ్రెస్ నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు భావోద్వేగానికి గురికాగా వారిని ఓదార్చి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ ప్రతి గడపకు సంక్షేమం అందించడమే నా బాధ్యత అని,వార్డుల్లో తిరుగుతున్న క్రమంలో పలువురు సమస్యలు ప్రణవ్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్మన్ అంజలి,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,జిల్లా అధికార ప్రతినిధులు,పట్టణ అధ్యక్షుడు,వార్డ్ అధ్యక్షులు,ప్రజా ప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్,యువజన,సేవాదళ్,వివిధ అనుబంధ సంఘాల నాయకులు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పెద్ద వాల్గొట్‌లో నాలుగు ఇందిరమ్మ ఇళ్లకు శుభారంభం



**సిరికొండ, ఆగస్టు 5 (జనంసాక్షి):**

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సహకారంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో భాగంగా సిరికొండ మండలంలోని పెద్ద వాల్గొట్ గ్రామంలో నాలుగు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బుధవారం ముగ్గు కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులు గద్దల సాయమ్మ, గంటాజిలత, తంసం మమత, గుద్దేటి శ్రీలత ఇళ్ల నిర్మాణాలకు సంప్రదాయబద్ధంగా ముగ్గు వేసి పనులను ప్రారంభించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి సహకారంతో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు జరిగిందని గ్రామ నాయకులు తెలిపారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకుని లబ్ధిదారులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తలకట్ల రాము, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రాజు,కారోబార్ గంగాధర్, కాంగ్రెస్ నాయకులు జగిరపు నర్సారెడ్డి, తలకట్ల శ్రీనివాస్, నాగేల్లి శ్రీనివాస్, మాజీ ఎం పి టి సి గద్దల భూమయ్య తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## రొంపికుంట గ్రామ సమాఖ్య భవనం పూర్తి చేయాలని వినతి

**కమాన్ పూర్, ఆగస్టు 05, (జనంసాక్షి):**

పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలోని కనకదుర్గ గ్రామసమాఖ్య భవన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని బుధవారం జరిగిన గ్రామసభలో సర్పంచ్ గుమ్మడి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామసమాఖ్య వివోలు వి.సౌజన్య, ఎం.డి.సల్మ ఆధ్వర్యంలో సంఘ సభ్యులు సర్పంచ్‌కు మెమోరండం సమర్పించారు. గతంలో భవనానికి పునాదులు వేసి, స్తంభాలు, పైకప్పుకు రేకులు వేసి వదిలివేయడంతో గత రెండు సంవత్సరాలుగా పనులు నిలిచిపోయాయని వారు తెలిపారు. ప్రస్తుతం భవనానికి చుట్టు గోడలు, కిటికీలు, తలుపులు, మరుగుదొడ్డి నిర్మాణం పెండింగ్‌లో ఉందని పేర్కొన్నారు. భవనం పూర్తయితే గ్రామసమాఖ్య కార్యకలాపాలు సజావుగా సాగుతాయని వివరించారు. రొంపికుంట కనకదుర్గ గ్రామసమాఖ్యలో 70 స్వయం సహాయక బృందాలు ఉన్నాయని, సుమారు 700 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని తెలిపారు. భవనం అందుబాటులోకి వస్తే సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడానికి మహిళలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు. అదే విధంగా సంఘంలో మరో వివోను నియమించాలని కూడా వారు కోరారు. సాధ్యమైనంత త్వరగా భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని సర్పంచ్‌ను కోరారు.

## నవోదయ ప్రవేశ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

### ఎంఈఓ రాములు



సిరికొండ, ఆగస్టు 5 (జనం సాక్షి):

ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు 2027-28 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతి నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని సిరికొండ మండల విద్యాధికారి పి. రాములు ఒక ప్రకటనలో తెలిపారు.నవోదయ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించిందని, అర్హత ఉన్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నవోదయ ప్రవేశ పరీక్ష నవంబర్ 28వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.పరీక్షకు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ అందించాలని ఎంఈఓ రాములు కోరారు. అలాగే తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, అర్హత ఉన్న ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



## మాత శిశు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**మంథని ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపర్డెంట్ టీ.వీ రాజశేఖర్ రెడ్డి**

**మంథని, ఆగస్టు 05, ( జనంసాక్షి) :**

పెద్దపల్లి జిల్లా మంథని మాత శిశు ఆరోగ్య కేంద్రంలో బుధవారం గైనకాలజిస్ట్ డాక్టర్ మామిడిపల్లి స్రవంతి, అనస్థీషియా స్పెషలిస్ట్ గుంట మౌనిక, చిన్నపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ చిలకలపల్లి నరేష్ ఆధ్వర్యంలో రెండు సిజిరియన్ సర్జరీలను విజయవంతంగా నిర్వహించారు. వారు బాబు, పాపకు జన్మించారని తల్లి, బిడ్డలు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్లు తెలిపారు. హాస్పిటల్ సూపర్డెంట్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో రెగ్యులర్ డాక్టర్ లను నియమించడం జరిగిందని తద్వారా మంథని ప్రాంత గర్భిణీ స్త్రీలకు చిన్న పిల్లలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ హాస్పిటల్ లకు దీటుగా మంథనిలో వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏమైనా సమస్యలు ఉన్నచో నేరుగా సూపర్డెంట్ డాక్టర్, సెల్ నెంబర్ 9885808589 సంప్రదించాలని కోరారు.

## మరణానంతరం ఇద్దరికి చూపు ప్రసాదించిన వెగ్గిలం చంద్రమౌళి

### కుటుంబ సభ్యుల నేత్రదాన నిర్ణయాన్ని అభినందించిన లయన్స్ క్లబ్ సభ్యులు



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 5, ( జనం సాక్షి)**

మానవతా దృక్పథానికి నిదర్శనంగా కరీంనగర్ హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన పదవీ విరమణ పొందిన డీపీవో అధికారి వెగ్గిలం చంద్రమౌళి మరణానంతరం ఆయన కళ్లను దానం చేయడంతో ఇద్దరు దృష్టి లోపం ఉన్నవారికి చూపు లభించే అవకాశం ఏర్పడింది.మరణానంతరం కూడా సమాజానికి సేవ చేయాలనే కుటుంబ సభ్యుల సంకల్పంతో ఆయన కుమారుడు వెగ్గిలం మనోజ్ తేజ్, బంధువు అంజని కుమార్ సహకారంతో నేత్రదానానికి అంగీకరించారు. సమాచారం అందుకున్న ఎల్.వి. ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఐ బ్యాంక్) వైద్య బృందం నిర్దేశిత వైద్య విధానాలను అనుసరిస్తూ నేత్రాలను విజయవంతంగా సేకరించింది.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సభ్యులు దివంగత చంద్రమౌళి కుటుంబాన్ని పరామర్శించి, వారి సేవా భావాన్ని అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు మాయడం శివకాంత్ మాట్లాడుతూ, ఒక వ్యక్తి నేత్రదానం ద్వారా ఇద్దరికి చూపును అందించవచ్చని, మరణానంతరం కూడా జీవితాలను వెలిగించే గొప్ప దానాల్లో నేత్రదానం ఒకటని అన్నారు. ప్రజలందరూ ముందుకు వచ్చి నేత్రదానానికి అంగీకరించాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బట్టు వినోద్, కోశాధికారి మేతుకు కృష్ణ చైతన్య, ముక్క శరత్ కృష్ణ, గజ్జుల సతీష్ కుమార్, కంటి ఆసుపత్రి ట్రస్టీ సభ్యుడు కోల అన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం



**సైదాపూర్ ఆగస్టు 5( జనం సాక్షి)**

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల ప్రత్యేక అధికారి జి సునీత అధ్యక్షతన మండల పరిషత్ అభివృద్ధి కార్యక్రమాలపై 17 అంశాలపై సమావేశం నిర్వహించారు.ప్రత్యేక అధికారి సునీత మాట్లాడుతూ,గ్రామ సర్పంచులకు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చేర్మెన్ దొంత సుధాకర్, పిఎసిఎస్ చైర్మన్ లు తిరుపతిరెడ్డి,వెంకట్ రెడ్డి ,తాసిల్దార్ శ్రీనివాస్,ఎంపీడీవో యాదరి, ఎంపీ ఓ కాజా బషీరుద్దీన్, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సైబర్ జాగృతి దివస్

○విజయ రూరల్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ అవగాహన ర్యాలీ ప్రారంభించిన పోలీస్ కమిషనర్

○అప్రమత్తతే రక్షణ - ధృవీకరణే భద్రత - అవగాహనే ఆయుధం" అని పిలుపు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 05: జనం సాక్షి**



జాతీయ సైబర్ జాగృతి దివస్ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సురక్షా కా తిరంగా ? సైబర్ ఇండిపెండెంట్ తెలంగాణ వైపు" రాష్ట్రవ్యాప్త సైబర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం నిజామాబాద్ నగరంలోని విజయ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల లో సైబర్ అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు విద్యార్థులు , అధ్యాపకులు, సిబ్బందితో కలిసి సైబర్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ , నేటి డిజిటల్ యుగంలో సాంకేతికత ఎంత వేగంగా అభివృద్ధి చెందుతోందో , అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా స్టాక్ ట్రేడింగ్, స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు ఆందోళనకరంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు.మోసగాళ్లు "100% గ్యారంటీ రిటర్న్స్" , "డైలీ ప్రాఫిట్" , "ఇన్‌సైడర్ టిప్స్" , "ప్రత్యేక పెట్టుబడి అవకాశాలు" వంటి తప్పుడు హామీలతో అమాయక ప్రజలను ఆకర్షిస్తున్నారని తెలిపారు. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు , నకిలీ వెబ్‌సైట్లు , వాట్సాప్ మరియు టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా ప్రారంభంలో నకిలీ లాభాలను చూపించి , అనంతరం మరింత పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టి , చివరకు జైష్ , ప్రాసెసింగ్ ఫీజు , అప్‌గ్రేడేషన్ ఛార్జీలు వంటి పేర్లతో అదనపు డబ్బులు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. అదేవిధంగా నకిలీ ఆర్థిక సలహాదారులు , నకిలీ కంపెనీ ప్రతినిధులుగా నటిస్తూ చట్టబద్ధమైన అనుమతులు లేని సంస్థల ద్వారా పెట్టుబడులు సేకరించి ప్రజలను మోసం చేస్తున్నారని తెలిపారు.ఈ సందర్భంగా ప్రజలకు ఆయన పలు సూచనలు చేశారు.అధిక లాభాలు వస్తాయని చెప్పే ప్రతి పెట్టుబడిని నమ్మవద్దు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ లేదా బ్రోకర్ అధికారికంగా నమోదు అయి ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించాలి. సోషల్ మీడియా , వాట్సాప్ , టెలిగ్రామ్ లేదా అపరిచిత వ్యక్తులు ఇచ్చే పెట్టుబడి సూచనలను నమ్మరాదు. వెంటనే పెట్టుబడి పెట్టాలని ఒత్తిడి చేసే వ్యక్తులను విశ్వసించరాదు. పెట్టుబడి పెట్టే ముందు కుటుంబ సభ్యులు లేదా అర్హత కలిగిన ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవాలి.సైబర్ మోసాలకు గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. త్వరితగతిన ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు.తెలంగాణ పోలీస్ శాఖ ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని , సైబర్ నేరాల నియంత్రణకు బ్యాంకులు , ఆర్థిక సంస్థలు, సంబంధిత శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. అయితే ప్రజల్లో అవగాహన పెంపొందినప్పుడే సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. 0 ప్రతి పౌరుడు అనే సూత్రాలను



పాటిస్తూ, " అప్రమత్తతే రక్షణ ? ధృవీకరణే భద్రత ? అవగాహనే ఆయుధం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని పోలీస్ కమిషనర్ పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం విద్యార్థులు , పోలీసు అధికారులు , అధ్యాపకులు మరియు సిబ్బందితో కలిసి సైబర్ అవగాహన పోస్టర్స్ ఆవిష్కరణ చేసి , ర్యాలీ నిర్వహించి ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో నిజామాబాదు ఏసీపీ బి. ప్రకాష్ యాదవ్ , నిజామాబాద్ రూరల్ ( నార్త్ ) సీఐ శ్రీనివాస్ , సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మొఖీద్ పాషా , మాక్లూర్ ఎస్ఐ అనిల్ కుమార్ , సైబర్ క్రైమ్ ఎస్ఐలు రవి కుమార్ , ప్రవలిక , సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది , విజయ రూరల్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ , సురేష్ , అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# హమాలీలకు సమగ్ర చట్టం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### డి .మల్లికార్జున్ జిల్లా అధ్యక్షులు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 05: జనంసాక్షి**

తెలంగాణ హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని బుధవారం నిజామాబాద్ లేబర్ కార్యాలయం ముందు తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ (ఎఐఫు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాను ఉద్దేశించిడి .మల్లికార్జున్, తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ (ఎఐఫు) జిల్లా అధ్యక్షులు,జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శివకుమార్ లు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హమాలీ కార్మికులు రోజు రోజుకు ఉపాధి కోల్పోతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హమాలీ కార్మికుల జీవనాధారం పూర్తిగా రైతులు పండించే వ్యవసాయ ఉత్పత్తులపైనే ఆధారపడి ఉంటుందని అన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ పెరగడం వల్ల గతంలో మూడు నుంచి నాలుగు నెలల పాటు కొనసాగే సీజనల్ ఉపాధి ప్రస్తుతం నెల రోజులకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు, గోదాములు, మార్కెట్ యార్డుల్లో స్థానిక హమాలీ కార్మికులకు పని కల్పించాల్సిన చోట గోదాం లేబర్ కాంట్రాక్టర్లు ఇతర రాష్ట్రాల వలస కార్మికులను అధిక సంఖ్యలో నియమిస్తూ స్థానిక కార్మికులను ఉపాధికి దూరం చేస్తున్నారని విమర్శించారు. ప్రతి హమాలీ కార్మికుడికి ప్రభుత్వ గుర్తింపు కార్డు జారీ చేసి, ఆ కార్డు ద్వారా అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు.అదేవిధంగా 50 సంవత్సరాలు పైబడిన హమాలీ కార్మికులకు నెలకు 10,000 పెన్షన్ ఇవ్వాలని, ప్రతి హమాలీ కార్మికుడికి ప్రత్యేక గ్రూప్ ఇన్సూరెన్స్ మరియు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, పరిశ్రమలు మరియు ప్రభుత్వ గోదాముల్లో పనిచేసే కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో. కోల్డ్ స్టోర్స్ హమాలీ యూనియన్ అధ్యక్షులు గంగాధర్, లక్ష్మణ్, పసుపు డోల్ హమాలీ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు పండరి, సీడ్ కంపెనీ హమాలీ వర్కర్ యూనియన్ జిల్లా.అధ్యక్షులు. సుశాంత్,విజిటేబుల్ హోల్ సేల్ మార్కెట్ ముల్లె హమాలీ యూనియన్ అధ్యక్షులు మచ్చ మోహన్, ముల్లె హమాలి యూనియన్ నాయకులు. మల్లేష్, పీరయ్య, రాములు, అంజి, రిక్షా పుల్లర్ హమాలీ.వర్కర్స్ యూనియన్. అధ్యక్షులు రైస్. ప్రధాన కార్యదర్శి వకీల్ యూనియన్ నాయకులు అన్వర్, ముజామిల్ దాదు తదితరులు పాల్గొన్నారు.

# ఛాతీ వ్యాధుల శస్త్రచికిత్సలో 'మినిమల్లీ ఇన్వాసివ్ థొరాసిక్ సర్జరీ

## యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్ రెడ్డి




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగష్టు 05: జనం సాక్షి**

ఊపిరితిత్తులు, అన్నవాహిక, ఛాతి మధ్య భాగం (మీడియాటినం ), దయాఫ్రేమ్,ఛాతీ గోడకు వచ్చే వ్యాధులను గుర్తించి చికిత్స చేయడానికి సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ అత్యాధునిక విధానాలను ఉపయోగిస్తోందని యశోద హాస్పిటల్స్ థొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.రోహన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మినిమల్లీ ఇన్వాసివ్, రోబోట్ సహాయంతో చేసి సర్జరీల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తోందన్నారు.ఊపిరితిత్తుల క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలో కణితులు వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల పేషంట్ల కు మరింత సురక్షితమైన ఆపరేషన్లను ఆసుపత్రి అందిస్తోందన్నారు.దీని ద్వారా ఖచ్చితమైన చికిత్స లభించడమే కాకుండా, పేషెంట్లు త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఇంటికి వెళుతున్నారన్నారు.థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి, ఛాతీలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేకమైన ఆపరేషన్, కొన్ని క్లిష్టమైన సమస్యలకు ఛాతీని పూర్తిగా తెరిచి చేసే ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినప్పటికీ, ఇప్పుడు ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయన్నారు.వీడియో కెమెరా సాయంతో చేసే సర్జరీ (వాట్స్ ), రోబోట్ సహాయంతో చేసే సర్జరీ (రాట్స్ ) వంటి పద్ధతుల ద్వారా కేవలం ఒక చిన్న రంధ్రం లేదా కోతతో ఆపరేషన్లు చేస్తున్నారన్నారు వీటివల్ల పేషెంట్లకు సర్జరీ కోత, నొప్పి చాలా తక్కువగా ఉంటాయని. ఆసుపత్రిలో ఎక్కువ రోజులు ఉండాల్సిన అవసరం కూడా ఉండదన్నారు.పేషేంట్లు చాలా త్వరగా తమ పనులు తాము చేసుకోగలుగుతారన్నారు.డాక్టర్లు కూడా చుట్టుపక్కల ఉండే అవయవాలకు ఎలాంటి హాని కలగకుండా చాలా ఖచ్చితత్వంతో ఈ ఆపరేషన్ చేయగలుగుతున్నరన్నారు . గత పదేళ్లలో ఛాతీ సర్జరీల్లో ఎన్నో మార్పులు వచ్చాయని ఈరోజుల్లో చిన్న కోతతో లేదా రోబోట్ సహాయంతో ఆపరేషన్లు చేస్తున్నామన్నారు.దీనివల్ల సంక్లిష్టమైన సమస్యలకు కూడా శరీరానికి పెద్దగా ఇబ్బంది కలగకుండా ఖచ్చితంగా చికిత్స చేయగలుగుతున్నాం" అని చెప్పారు. "వ్యాధిని ముందుగానే గుర్తించడం ఆధునిక సర్జరీ నైపుణ్యాలు అన్ని విభాగాల వైద్యులు కలిసి క్యాన్సర్ కు వైద్యం చేయడం వల్ల సిషేంట్లకు అత్యుత్తము చికిత్స అందుతోందన్నారు.వారు త్వరగా కోలుకొని సాధారణ జీవితం గడపగలుగుతున్నారన్నారు.ప్రతి పేషెంట్ కు వారి ఆరోగ్యపరిస్థితికి తగ్గట్టుగా ఆధునిక టెక్నాలజీని ఉపయోగిస్తూనేతో ప్రేమతో కూడిన వైద్యం అందించడమే మా లక్ష్యం" అని ఆయన వివరించారు.ఆదువాతన ఆపరేషన్ థియేటర్లు, హై-డెఫినిషన్ ఇమేజింగ్ సిస్టమ్స్, రోబోటిక్ సర్జికల్ ప్లాట్‌ఫారమ్‌లు, థొరాసిక్ సర్జన్లు, పల్మోనాలజిస్టు, ఆంకాలజిస్టు, రేడియాలజిస్టు, అనస్థీషియాలజిస్టులు, క్రిటికల్ కేర్ నిపుణులతో కూడిన మల్టీడిసిప్లినరీ బృందం మద్దతుతో, యశోద హాస్పిటల్స్ అనేక రకాల థొరాసిక్ (ఛాతి) సమస్యలకు సమగ్రమైన చికిత్సను అందిస్తోందన్నారు . ప్రారంభ దశలో ఉన్న ఊపిరితిత్తుల క్యాన్సర్లు,అన్నవాహిక వ్యాధుల నుండి ప్రాణాపాయం లేని ఛాతీ కణితులు సంక్లిష్టమైన దాతీ ఎమర్జెన్సీల వరకు, హాస్పిటల్ ఎవిడెన్స్- బేస్డ్, మినిమల్లీ నాసివ్ సర్జికల్ సేవలను నిరంతరం విస్తరిస్తోందన్నారు . పేషెంట్లు మెరుగైన భద్రత సౌకర్యంతో మంచి ఫలితాలను సాధించడంలో సహాయపడుతుందన్నారు.యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ గత మూడు దశాబ్దాలుగా వైవిధ్యమైన వైద్య అవసరాలు కలిగిన ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందిస్తోందని,సమర్థవంతమైన నాయకత్వం బలమైన యాజమాన్యం కింద, యశోద గ్రూప్ అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య చికిత్సను అందించే 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా ఎదిగిందన్నారు. పేషంట్ల అవసరాలకు అనుగుణంగా, అరుదైన క్లిష్టమైన ప్రక్రియల కోసం సైతం విప్లవాత్మక సాంకేతికతను ఉపయోగిస్తూ, యశోద గ్రూప్ ప్రతి వైద్య విభాగంలోనూ అత్యాధునిక రోగనిర్ధారణ చికిత్సా సేవలను అందిస్తోందన్నారు .ఈ విలేకరుల సమావేశంలో సీనియర్ మేనేజర్ రూపేష్ షిండే, మార్కెటింగ్ మేనేజర్ అమర్నాథ్ మూర్తి లు పాల్గొన్నారు.



# కాంగ్రెస్‌ను నిజామాబాద్ రూరల్‌లో శాశ్వత కంచుకోటగా తీర్చిదిద్దుదాం

## ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

**○పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు**

**○రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు**

**○ కష్టాల్లో నేను తోడుంటా?పార్టీ కోసం మీరు పనిచేయండి**

ఇందల్వాయి **(జనంసాక్షి):**
ఇందల్వాయి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతల కిషన్ అధ్యక్షతన నిర్వహించిన మండల కాంగ్రెస్ పార్టీ సమావేశంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన మండల పార్టీ నూతన కమిటీని అభినందించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, రాష్ట్ర రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ వైఖరి, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఆయన విస్తృతంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఎదిగిందని, ఆ విజయానికి నాయకులు, కార్యకర్తల కృషే కారణమని అన్నారు. రాజకీయంగా చైతన్యవంతమైన ఇందల్వాయి మండలంలో గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని, కష్టానికి తగిన గుర్తింపు, సముచిత స్థానం కల్పించడం కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు.
పార్టీ సీనియర్ నాయకులు ఇమ్మడి గోపి, కర్నా మోహన్ అకాల మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ, వారి సేవలను స్మరించుకున్నారు. అనంతరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని సమావేశంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.
ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ.."నేను డాక్టర్ కాబట్టి సున్నితంగా ఉంటానని అనుకోవద్దు.. మంచివారికి మంచివాడిని, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసేవారి పక్షాన ఎప్పుడూ నిలబడతాను" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడుతోందని, రాజ్యాంగ విలువలను కాపాడే బాధ్యత కాంగ్రెస్‌పై ఉందన్నారు. రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని, ప్రజల్లో ప్రభుత్వంపై మరింత విశ్వాసాన్ని పెంపొందించేలా పార్టీ నాయకులు కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో ఇతర పార్టీలకు అవకాశం లేకుండా నిజామాబాద్ రూరల్‌ను కాంగ్రెస్‌కు శాశ్వత కంచుకోటగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీ నాయకులందరూ అన్నదమ్ముల్లా ఐక్యంగా పనిచేస్తే విజయాలు మరింత సులభమవుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష పార్టీలపై కూడా ఎమ్మెల్యే విమర్శలు గుప్పించారు. బీఆర్‌ఎస్ పార్టీలోనే అంతర్గత విభేదాలు నెలకొన్నాయని, కాంగ్రెస్‌ను ఎదుర్కోవడానికి ఆ పార్టీ నాయకులు రాజకీయాల కంటే పూజలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. పూజలు చేయడం కంటే ప్రజలకు సేవ చేయాలని సూచించారు.
కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించిన ఆయన, ఆ ప్రాజెక్టులో అవినీతి జరిగిందని బీఆర్‌ఎస్ నాయకత్వానికే చెందిన నాయకులు చెబుతున్న నేపథ్యంలో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపైనా ఎమ్మెల్యే విమర్శలు చేశారు. దేశ భవిష్యత్, యువత అవసరాలపై కేంద్ర ప్రభుత్వం సరైన దృష్టి పెట్టడం లేదని, పరీక్షల నిర్వహణలో కూడా వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ దేశ ఆస్తులను విక్రయిస్తోందని ఆరోపించారు. రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతను దెబ్బతీసే చర్యలు జరుగుతున్నాయని, విద్యార్థుల పట్ల కూడా అమానుష వైఖరి ప్రదర్శించారని విమర్శించారు.
ఈ పరిస్థితులను రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సమర్థంగా ఎదుర్కొంటోందని, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త మరింత చైతన్యంతో పనిచేయాలని ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ గౌడ్, బాల్ రాజు, పొలసాని శ్రీనివాస్, వెంకట్ , ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, ఇందల్వాయి మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు సర్పంచులు పాల్గొన్నారు.



# ప్రజలకు సేవకులుగా పనిచేయాలి

**చొప్పదండి, ఆగస్టు 5 (జనంసాక్షి):**
ఎన్నికలలో గెలిపించిన ప్రజలకు పాలకులుగా కాకుండా సేవకులుగా పనిచేసే ఓట్లు వేసిన ప్రజల ఆశాలను వమ్ము చేయకుండా గ్రామాలను అభివృద్ధి పరచాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల స్థాయి సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రగతి వివరాలను సంబంధిత శాఖ అధికారుల ద్వారా తెలుసుకుంటూ క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రజల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహవినియోగాలకు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు అందించామని వివరించారు. మల్లన్నపల్లి, గుమ్లాపూర్ గ్రామాలలో తాగునీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నందున ట్యాంకర్ ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, అలాగే ఈ గ్రామాలలో చాలా మంది భూమి ఉండి పట్టాలు లేక వ్యవసాయం చేసుకుంటున్న రైతులు యాప్ ద్వారా యూరియా అందక ఇబ్బందులు పడుతున్నారని ప్యాక్స్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పలువురు సర్పంచ్ లు ఆయా గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న జీపీ,వివో బిల్డింగ్ లు, రోడ్లు మంజూరు పూర్తి చేయాలని, అవసరమైన గ్రామాలలో కొత్తవి మంజూరి చేయాలని, బస్సు సౌకర్యం లేని గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని, పేదలకు ఇండ్లు, గృహవినియోగదారులకు గృహజ్యోతి వర్తింపజేయాలనీ కోరగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని, అన్ని పనులకు నిధులు మంజూరి చేశామని పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని వెల్లడించారు. వరద కాలువ నుంచి ఓ టీ ల ద్వారా గ్రామాలకు నీళ్లు అందించే పనులు త్వరలో పూర్తి చేసి ప్రజల తాగు నీటికి, రైతుల సాగునీటి ఇబ్బందులు తొలగిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అంతకు ముందు 15 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు, ప్రమాద వశాత్తు మరణించిన రెండు రైతు కుటుంబాలకు ఐదు లక్షల చొప్పున ప్రమాద భీమా ప్రోసీడింగ్ లు అందజేశారు. తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత, ప్యాక్స్ చైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడిఓ వేణుగోపాల్ రావు, తహసీల్దార్ నవీన్ కుమార్, పలు గ్రామాల సర్పంచ్ లు, ఏ ఓ మమత, హార్టికల్చర్ అధికారి స్వాతి, విద్యుత్ ఏఈ లు చంద్రయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



# పెద్ద వాల్గోట్‌లో నాలుగు ఇందిరమ్మ ఇళ్లకు శుభారంభం

**సిరికొండ, ఆగస్టు 5 (జనంసాక్షి):**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో భాగంగా సిరికొండ మండలంలోని పెద్ద వాల్గోట్ గ్రామంలో నాలుగు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు బుధవారం ముగ్గు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంప్రదాయబద్ధంగా ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ పిట్ల వనిత నర్సింగ్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తలకట్ల రాము, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, గ్రామ కార్యదర్శి రాజు, కారోబార్ గంగాధర్ కాంగ్రెస్ నాయకులు జగిరపు నర్సారెడ్డి, తలకట్ల శ్రీనివాస్, నాగేల్లి శ్రీనివాస్ మరియు పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# నగర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ముందుకు

**జీజీహెచ్ లో మౌలిక వసతులపై మంత్రికి వినతి**

**ఆర్ వోబీ..ఆర్ యూబీ..నిర్మాణం, బస్ స్టాండ్ ఆధునికీకరణ కోసం మంత్రులను కలిశా**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 05: జనం సాక్షి**

ఇందూరు: నగర సమగ్రాభివృద్ధే లక్ష్యంగా తన ప్రతి అడుగు ఉంటుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వం ఏర్పడి రెండున్నర ఏళ్ళు గడిచినా..నియోజకవర్గ అభివృద్ధి కోసం నయాపైసా ఇవ్వడం లేదన్నారు. నగర మేయర్, కార్పొరేషన్ కమిషనర్ ర్ నగరంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓటమి చెందిన వారికి నిధులు ఇస్తున్నారు తప్ప, ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. గతంలో అనేక సార్లు ఆయా శాఖల మంత్రులను కలవడం జరిగిందని గుర్తు చేశారు. నగర అభివృద్ధి కోసం మళ్లీ నలుగురు మంత్రాన్ని కలవడం జరిగిందన్నారు. ప్రధానంగా రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ను కలిసి పలు అంశాలపై వినతి అందజేశానన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు పెరుగుతోందని, దీనికి శాశ్వత పరిష్కారం చూపే దిశగా రూ.100 కోట్లతో నాందేవాడ, దేవి రోడ్డు, రైల్వే స్టేషన్ అదనపు వంతెన నిర్మించాలని ప్రతిపాదించినట్లు చెప్పారు. అలాగే రూ.70 కోట్లతో ఎల్లమ్మ గుట్ట రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరానన్నారు. అలాగే వర్ని, నిజామాబాద్, డిచ్పల్లి, ఇందల్వాయి, భీమ్గల్ కమ్మర్పల్లి వరకు నగరం మీదుగా 107 కిలోమీటర్ల కొత్త జాతీయ రహదారి ప్రతిపాదనలు కూడా అందించినట్లు పేర్కొన్నారు. నగరంలోని రేడియో స్టేషన్ నుంచి ముదక్పల్లి వరకు రోడ్లు భవనాల రహదారి అభివృద్ధి కూడా అవసరమని వివరించినట్లు పేర్కొన్నారు. ఇందూరులోని టీ హబ్ ద్వారా యువతకు ప్రముఖ ఎంఎన్ సీ కంపెనీలు తీసుకురావాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కలిసినట్లు చెప్పారు. ఇందూరు యువతలో ప్రతిభకు కొదవలేదని, ఉద్యోగ అవకాశాల కోసం హైదరాబాద్, బెంగళూరు, పూణే వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. యువతను నగరాలకు పంపడం కాదని, ఉద్యోగాలను నిజామాబాద్కే తీసుకురావాలని అన్నారు.జిల్లా జనరల్ ఆస్పత్రి సమస్యలను సమగ్రంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ని కలిసి వివరించినట్లు తెలిపారు. ఎమ్మారై యంత్రం ఇప్పటికీ లేకపోవడం, మార్చురీ ఫ్రీజర్ల కొరత, లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ లేకపోవడం ప్రధాన సమస్యలన్నారు. అలాగే సివిల్ సర్జన్, ఆర్ ఎంఓ లు, క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. పేదల ప్రాణాలను కాపాడే ఆసుపత్రిలో సౌకర్యాల కొరత ఉండకూడదని, ప్రజల ఆరోగ్యం పై రాజీపడే పరిస్థితి ఎప్పుడు ఉండకూడదు అన్నారు.తెలంగాణలోని ప్రధాన నగరాల్లో ఒకటైన నిజామాబాదు బస్టాండులో పెరిగిన రద్దీకి తగిన సౌకర్యాలు లేకపోవడం శోచనీయమని అన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి అందజేసినట్లు చెప్పారు. గతంలో స్థలానికి సంబంధించి వినతి పత్రం కూడా అందజేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న బస్టాండ్కు విశాలమైన వేచి ఉండే హాలు, సిట్టింగ్ కెపాసిటీ పెంపు, డిజిటల్ బస్సు ఇన్ఫర్మేషన్ బోర్డులు, ఎల్ఈడి స్క్రీన్లు, సీసీ కెమెరాలు, పార్కింగ్ సదుపాయం పరిశుభ్రత వంటి అంశాలపై వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో నిజామాబాద్ అభివృద్ధిని వేగవంతం చేయాలన్నదే తన ప్రయత్నమని అర్బన్ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇందుకోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ గారితో కలిసి రైల్వే శాఖకు సంబంధించిన అనేక ప్రతిపాదనలు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు అందజేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్కర్ లక్ష్మి నారాయణ, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, కార్పొరేటర్లు బెల్లాల్ శశాంక్, జ్యోతి మురళి, శ్యామల సత్యపాల్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, బంటు ప్రీతి ప్రవీణ్, ప్రసూన శ్రీనివాస్, ఇప్పకాయల సుమిత్ర కిషోర్, పసునూరి రాము, బట్టు రాఘవేందర్, ఎస్సీ మోర్చ నాయకులు జస్పాల్ సింగ్, బాబీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.





## బూరుగుపల్లిలో చెత్త బుట్టల పంపిణీ..

### శాస్త్రీయ వ్యర్థాల వర్గీకరణలో ఆదర్శం: ఎంపీడీఓ

**పెద్ద కొడప్గల్ ఆగస్టు 05 (జనంసాక్షి):**

శాస్త్రీయ వ్యర్థాల వర్గీకరణకు శ్రీకారం చుట్టిన బూరుగుపల్లి గ్రామం ఆదర్శంగా నిలిచిందని ఎంపీడీఓ బీఆర్ అభినవ్ చందర్ తెలిపారు. బుధవారం మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో నాలుగు రకాల చెత్తబుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ... జిల్లాలోనే తొలిసారిగా, రాష్ట్రంలోనూ అరుదైన కార్యక్రమంగా బూరుగుపల్లి గ్రామంలోని ప్రతి ఇంటికి నాలుగు రంగుల వ్యర్థాల వర్గీకరణ చెత్త బుట్టలను అందజేసి శాస్త్రీయ ఘన వ్యర్థాల నిర్వహణకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఆకుపచ్చ బుట్టలో తడి వ్యర్థాలు అనగా ఆహార అవశేషాలు, కూరగాయలు, పండ్ల తొక్కలు తదితర జీవవ్యర్థాలు వేయాలని, నీలం బుట్టలో పొడి వ్యర్థాలు అనగా ప్లాస్టిక్, కాగితం, సీసాలు, ప్యాకేజింగ్ పదార్థాలు తదితర రీసైకిల్ చేయదగిన వ్యర్థాలు వేయాలని, ఎరుపు బుట్టలో శానిటరీ వ్యర్థాలు అనగా శానిటరీ న్యాప్కిన్లు, డైపర్లు, వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన వ్యర్థాలు వేయాలని, నలుపు బుట్టలో ప్రమాదకర వ్యర్థాలు అనగా బ్యాటరీలు, ఈ-వ్యర్థాలు, బల్బులు తదితర హానికర వ్యర్థాలు వేయాలని తెలిపారు. వ్యర్థాల వర్గీకరణను తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించబడతాయని తెలియజేశారు. గ్రామ పరిశుభ్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అభినవ్ చందర్, ఎంపీఓ లక్ష్మీకాంత్ రెడ్డి, సర్పంచ్ మారుతిరావ్, నారాయణ రావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఎక్స్ప్లోరికా పాఠశాలలో ఘనంగా ఎన్త్రోన్మెంట్ వేడుకలు

### పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు




**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 5 (జనంసాక్షి) :**

స్థానిక జ్యోతినగర్లోని పారమిత ఎక్స్ప్లోరికా పాఠశాలలో బుధవారం రోజు విద్యార్థి నాయకుల ఎన్త్రోన్మెంట్ వేడుకలును ఘనంగా నిర్వహించారు. ఇటీవల పాఠశాలలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థి ప్రతినిధులు ఈ సందర్భంగా అధికారికంగా తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా హెడ్ బాయ్, హెడ్ గర్ల్ , డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే స్కూల్ కౌన్సిల్ హెడ్, స్కూల్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్, డిసిప్లిన్ కమిటీ హెడ్, డిసిప్లిన్ కమిటీ డిప్యూటీ హెడ్, ఈవెంట్ కౌన్సిల్ హెడ్, ఈవెంట్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్, అకాడమిక్ కౌన్సిల్ హెడ్, అకాడమిక్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్ బాధ్యతలను స్వీకరించి విధేయతతో సేవలందిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై తమ పిల్లలు నాయకత్వ బాధ్యతలు స్వీకరించడాన్ని గర్వంగా వీక్షించారు. ప్రమాణ స్వీకారం అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు, ఇతర కళారూపాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు మాట్లాడుతూ... విద్యార్థుల్లో చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచన, క్రమశిక్షణ, సేవాభావం, ప్రజాస్వామ్య విలువలను పెంపొందించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. నాయకత్వం అనేది పదవితో కాకుండా సేవాభావం, నిజాయితీ, బాధ్యతతో నిరూపించబడుతుందని విద్యార్థులకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన విద్యార్థి నాయకులను పాఠశాల నిర్వాహకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందిస్తూ, వారి పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అనుకర్ రావు, వి.యు.యం. ప్రసాద్, రశ్మిత, వినోద్ రావు, రాకేశ్, ప్రసూన, ప్రాచీ, ప్రధానోపాధ్యాయురాలు శర్మిష్ట , ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



తోట రాహుల్ 1 వ ర్యాంకు | నెల్సన్ ఫ్రాన్సిస్ రాఫెల్ 5 వ ర్యాంకు | తలారీ ప్రభాస్ 13 వ ర్యాంకు
నౌషీన్ బీ 16 వ ర్యాంకు | గుడెపు రిషిత 16 వ ర్యాంకు | కొండారెడ్డి శ్రీవాణి 21 వ ర్యాంకు

## ఉచిత ఎం.కాం. ఆన్లైన్ కోచింగ్తో రాష్ట్రస్థాయిలో ర్యాంకుల ప్రభంజనం

### టీజీ సీపీగెట్లో స్టేట్ ఫస్ట్తో సహా పలువురికి టాప్ ర్యాంకులు

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 5, ( జనం సాక్షి)**

ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కరీంనగర్, కాకతీయ గవర్నమెంట్ కళాశాల, హనుమకొండ, తెలంగాణ కామర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉచిత ఆన్లైన్ పీజీ ఎంట్రెన్స్ కోచింగ్?2026 ఫలితాలు విశేష విజయాన్ని నమోదు చేశాయి. ఈ కోచింగ్ ద్వారా శిక్షణ పొందిన విద్యార్థులు తెలంగాణ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్ (టీజీ సీపీగెట్) ఎం.కాం. ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించారు.ఉచిత ఆన్లైన్ కోచింగ్ కన్వీనర్ డా. బూర్ల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, తోట రాహుల్ ఎం.కాం. ప్రవేశ పరీక్షలో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించగా, నెల్సన్ ఫ్రాన్సిస్ రాఫెల్ 5వ ర్యాంకు, తలారీ ప్రభాస్ 13వ ర్యాంకు, నౌషిన్ బీ 16వ ర్యాంకు, గుడెపు రిషిత 16వ ర్యాంకు, కొండారెడ్డి శ్రీవాణి 21వ ర్యాంకు సాధించి సంస్థలకు గుర్తింపు తీసుకొచ్చారు.ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ, కాకతీయ గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ అభినందించారు. అలాగే కార్యక్రమ కోఆర్డినేటర్లు టి. రాజయ్య, ప్రొఫెసర్ డి. రాజశేఖర్, కన్వీనర్ డా. బూర్ల నరేష్, కో-కన్వీనర్లు డా. కాంపల్లి అర్జున్, డా. గంగిశెట్టి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు, అధ్యాపక బృందం విద్యార్థుల విజయాన్ని ప్రశంసించి, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# సురక్షా తిరంగా?సైబర్ స్వతంత్ర తెలంగాణకు శ్రీకారం..

## భిక్నూర్‌లో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ప్రారంభం

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జనం సాక్షి)

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీసబ్ ) ఆధ్వర్యంలో జాతీయ సైబర్ జాగృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "సురక్షా తిరంగా ? సైబర్ స్వతంత్ర తెలంగాణ" నెల రోజుల సైబర్ భద్రత అవగాహన కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లా భిక్నూర్‌లో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా కొత్త రూపాల్లో విస్తరిస్తున్నాయని, ప్రజల అప్రమత్తతే వాటిని అరికట్టేందుకు అత్యంత ప్రభావవంతమైన ఆయుధమని అన్నారు. స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్, బిజినెస్ స్కామ్‌లు, ఫేక్ లింకులు, ఓటీపీ మోసాలు, బజాజ అప్‌డేట్ పేరుతో జరిగే మోసాలు, డిజిటల్ అరెస్ట్ బెదిరింపులు, నకిలీ కస్టమర్ కేర్ కాల్స్ వంటి మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం కృత్రిమ మేధస్సు (ఎఐ) వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ వాయిస్ కాల్స్, సోషల్ మీడియా మోసాలు కూడా అధికమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత, ఉద్యోగార్థులు పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, పెట్టుబడుల ఆఫర్లు, అపరిచిత సందేశాలు, ఖీఫీ కోడ్‌లను పూర్తిగా ధృవీకరించకుండా నమ్మవద్దని హెచ్చరించారు. అలాగే ఓటీపీ , ఏటీఎం పిన్ , సీవ్ , బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫోన్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ఎస్పీ కోరారు. వెంటనే ఫిర్యాదు చేస్తే నేరగాళ్లు కాజేసిన నగదును ఫ్రీజ్ చేసి తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ భద్రత ప్రతిజ్ఞ చేయించడంతో పాటు అవగాహన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఆగస్టు నెల మొత్తం జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వయం సహాయక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో విస్తృత స్థాయిలో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. "సురక్షా తిరంగా" కార్యక్రమాన్ని విజయవంతం చేసి సైబర్ నేరాల రహిత కామారెడ్డి జిల్లాను నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, భిక్నూర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నరేష్, సైబర్ క్రైమ్ ఎస్‌బీఐ నరేష్, భిక్నూర్ ఎస్ఐ అనిల్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, గ్రంథాలయ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.









# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ గడువు లోపు పూర్తి చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత

మెట్ పెల్లి, ఆగష్టు 5( జనంసాక్షి)



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగంగా నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.ఎస్. లత తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు ఫారాలను పంపిణీ చేయగా, నిర్దేశించిన గడువులోపు ప్రజల వద్ద నుండి ఫారాలను సంబంధిత బీఎల్ఓలు తీసుకోవాలని అన్నారు. ప్రజలకు ఫారాలు నింపడంలో ఏవైనా సందేహాలు ఉంటే తమ పరిధిలోని బీఎల్ఓలను లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ప్రతి ఓటరికి అవసరమైన సహాయం అందించేందుకు ఎన్నికల సిబ్బంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ఫారాల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో బీఎల్ఓలతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. కొంతమంది ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో నివసించడం లేదని, వేరే ప్రాంతాలకు మారారని లేదా ఇతర ప్రాంతాల్లో ఓటు నమోదు చేసుకున్నారని బీఎల్ఓల ద్వారా సమాచారం అందుతోందన్నారు. అలాంటి వారు తప్పనిసరిగా సంబంధిత ఫారాన్ని పూర్తి చేసి తమ ప్రస్తుత వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. వేరే ప్రాంతంలో ఓటు ఉన్నట్లయితే ఆ వివరాలను ఫారంలో పేర్కొనడం ద్వారా అవసరమైన మార్పులు చేసి సరైన నియోజకవర్గంలో ఓటు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒకవేళ ఫారాలు సమర్పించకుండా ఎలాంటి స్పందన ఇవ్వకపోతే, ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించబడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రతి అర్హ ఓటరు ఆగష్టు 10వ తేదీలోపు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓకు అందజేసి, తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మెట్ పెల్లి తహసీల్దార్లు నీత, బి.ఎల్.వో లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను సకాలంలో అందించాలి: కలెక్టర్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జనం సాక్షి)

జిల్లాలోని ప్రభుత్వ, సంక్షేమ, రెసిడెన్షియల్ విద్యాసంస్థల విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలను నిర్ణీత గడువులోగా అందించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం గాంధారి మండలంలోని యూనిఫాం కటింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, కటింగ్ మరియు స్టిచింగ్ పనులను పరిశీలించి మహిళా టైలర్లతో నేరుగా మాట్లాడారు. వస్త్రాల లభ్యత, కొలతల ప్రకారం కటింగ్, రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం, పనిలో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి సరైన కొలతలతో, నాణ్యతకు ఎలాంటి రాజీ పడకుండా యూనిఫాంలను కుట్టించి సకాలంలో పాఠశాలలకు పంపిణీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహిళా టైలర్లకు ఉపాధి కల్పిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. జిల్లాలో యూనిఫాంల పంపిణీ పురోగతిని సమీక్షించిన కలెక్టర్, రెసిడెన్షియల్ పాఠశాలల్లో తొలి విడత యూనిఫాంల పంపిణీ పూర్తయినందుకు అధికారులను అభినందించారు. ప్రభుత్వ, సంక్షేమ పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న స్టిచింగ్, పంపిణీ పనులను వేగవంతం చేసి ప్రతి విద్యార్థికి యూనిఫాంలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని 959 విద్యాసంస్థలు, పాఠశాలలు, హాస్టళ్లలో మొత్తం 89,279 మంది విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన యూనిఫాంలు అందేలా సంబంధిత అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ఎలాంటి జాప్యం లేకుండా పంపిణీ పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దామోదర్, ఎల్లారెడ్డి ఆర్డీవో, డీపీఎం, ఏపీఎం, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వర్షాభావంతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలి

## పంటల బీమా, రైతు బీమా వెంటనే అమలు చేయాలని ఏఐయూకెయస్ డిమాండ్

**సిరికొండ, ఆగస్టు 5 (జనంసాక్షి):**

రాష్ట్రంలో వర్షాభావం కారణంగా విత్తిన విత్తనాలు మొలకెత్తకపోవడం, మొలకెత్తిన పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం వెంటనే ఎకరానికి రూ.50 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం (ఎఐకెఎంఎస్) డిమాండ్ చేసింది. బుధవారం సిరికొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌కు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. బాబన్న మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో జూలై మూడో వారం వరకు రాష్ట్రంలో సాధారణ వర్షపాతంలో కేవలం 30 నుంచి 40 శాతం మాత్రమే నమోదైందని తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రైతులు పత్తి, సోయాబీన్, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసినప్పటికీ వర్షాభావంతో లక్షలాది ఎకరాల్లో విత్తనాలు మొలకెత్తలేదని, మొలకెత్తిన పంటలు కూడా నీటి కొరతతో ఎండిపోయాయని పేర్కొన్నారు. రైతులు ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు సాగు ఖర్చులు పెట్టి తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారని, కొందరు రెండోసారి విత్తనాలు వేసినా అవి కూడా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో పంటల బీమా అమలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను అమలు చేయకపోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల్లో రైతులకు ఎలాంటి రక్షణ లేకుండా పోయిందన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా రైతులను నిరాశపరుస్తోందని విమర్శించారు. రైతులకు పంటల బీమా, రైతు బీమా పథకాలను తక్షణమే అమలు చేయాలని, వ్యవసాయ రుణాలను ఒకేసారి మాఫీ చేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని, పశువులకు అవసరమైన మేతను ప్రభుత్వం ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వర్షాభావంతో ఉపాధి కోల్పోయిన వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.650 చొప్పున 200 రోజుల పని కల్పించి, ప్రతి కుటుంబానికి నెలకు రూ.10 వేల జీవన భృతి అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ యూ కె యస్ జిల్లా నాయకులు మల్కి లింభాద్రి, పందరి, పూర్రా రాజన్న, గామ గంగన్న, రణదీష్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు కే. ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.



## పీఎంఫమ్ పథక లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి : డీఆర్‌డీఓ దామోదర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 5 (జనం సాక్షి)**

కామారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పీఎంఫమ్ (ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల అభివృద్ధి పథకం) సింగిల్ విండో డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఆర్‌డీఓ దామోదర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంఫమ్ పథకం ద్వారా మహిళా సంఘాల సభ్యులు గ్రామీణ స్థాయిలో చిన్న ఆహార శుద్ధి యూనిట్లను ఏర్పాటు చేసి స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అలాగే ఏపీఎంలు, సీసీలు తమకు నిర్దేశించిన లక్ష్యాల కంటే అధికంగా యూనిట్లను ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని కోరారు.




ఎల్‌డీఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ బ్యాంకుల వద్ద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేసేలా బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

అదనపు డీఆర్‌డీఓ కె.పి. విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని మండలాల వారీగా సమీక్షించి ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో నాబార్డ్ డీడీ ప్రవీణ్ కుమార్, జీఎం డీఐసీ తులసీదాస్, లక్ష్మీకాంత్, ఇక్రిశాట్ ప్రతినిధి శ్రీ రాజేష్, అఖిల్ తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రతినిధులు, సెర్ప్ డీపీఎంలు సురేశ్ కుమార్, రాజయ్య, వివిధ బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, అన్ని మండలాల ఏపీఎంలు, బ్యాంకుల్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, డీఆర్‌డీఏ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణ కల్పించాలి

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**- జిల్లాలోని అనాథ పిల్లలను పూర్తిస్థాయిలో గుర్తించాలి**

**- చదువు మానేసిన పిల్లలను తిరిగి విద్యాభ్యాసానికి చేరువ చేయాలి**

**- సీసీఐ హోమ్‌లలో పిల్లలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి**

**- సమీకృత బాలల సంరక్షణ పథకం (ఐ సి పి ఎస్) అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి,ఆగస్టు 05(జనంసాక్షి) : జిల్లాలో ప్రతి చిన్నారికి భద్రత, విద్య, సంరక్షణతో పాటు ప్రభుత్వ పరిరక్షణ సేవలు పూర్తిస్థాయిలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమీకృత బాలల సంరక్షణ పథకం (ఐ సి పి ఎస్) అమలుపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న అనాథ పిల్లలను పూర్తిస్థాయిలో గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అలాగే దివ్యాంగులు, మానసిక వైకల్యం కలిగిన పిల్లలను గుర్తించి వారికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్ (సీసీఐ) హోమ్‌లలో ఉన్న పిల్లలకు అవసరమైన వసతులు, సంరక్షణ, భద్రత కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. పిల్లలకు ఎక్కడ ఎటువంటి సమస్య తలెత్తినా వెంటనే స్పందించేలా జిల్లాను మూడు విభాగాలుగా విభజించి పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువు మానేసిన పిల్లలను గుర్తించి తిరిగి విద్యాభ్యాసంలోకి తీసుకువచ్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పదో తరగతి ఉత్తీర్ణులైన పిల్లలకు అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ కేంద్రాల్లో వివిధ కోర్సుల్లో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారి వివరాలను సేకరించి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సి డబ్ల్యూ సి), జువెనైల్ జస్టిస్ బోర్డు (జె జె బి) పరిధిలోని కేసుల పురోగతి, బాలల గృహాల తనిఖీలు, ఫోస్టర్ కేర్, స్పాన్సర్‌షిప్ పథకాల అమలు, మిస్సింగ్/ఫౌండ్ చిల్డ్రన్ కేసులు, బాలల భద్రత చర్యలపై జిల్లా కలెక్టర్ సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఫీల్డ్ విజిట్లు క్రమం తప్పకుండా నిర్వహించాలని, అన్ని ఆన్‌లైన్ యాప్‌లలో సమాచారాన్ని ప్రతిరోజూ నవీకరించాలని, పెండింగ్ అంశాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత పెంచి ప్రభుత్వ లక్ష్యాలను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతి మండలంలో బాలల సంక్షేమ కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఫార్వర్డ్ బ్లాక్‌లో భారీగా చేరికలు

### - పార్టీ కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించిన కొలిపాక శ్రీనివాస్

పెద్దపల్లి,ఆగస్టు 05(జనంసాక్షి) : పెద్దపల్లి పట్టణంలోని 25వ వార్డుకు చెందిన పలువురు యువకులు బుధవారం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలో చేరారు. కుక్క చరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు కొలిపాక శ్రీనివాస్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొలిపాక శ్రీనివాస్ మాట్లాడుతూ అణగారిన వర్గాలంతా ఐక్యంగా నిలిస్తే రాజ్యాధికారం సాధించడం సాధ్యమవుతుందన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ టౌన్ కన్వీనర్ కుక్క శ్రావణ్ కుమార్, కుక్క కనకరాజు, మెహరాజ్, 25వ వార్డు సభ్యుడు మాచర్ల సాగర్, కుక్క అజయ్, కుక్క ఆదర్శ్, కుక్క శ్రావణ్,పేర్క నరేష్, చిలుక శశికుమార్,ఈర్ల గోపిచంద్, కుక్క రాజు, కుక్క దేవయ్య, కుక్క లక్ష్మయ్య, కుక్క రామస్వామి, ఈర్ల సాయి ప్రసన్న, రామగళ్ల ధనశ్రీ,కుక్క జీవన్,ఈర్ల నికిత, కుక్క సౌమ్య,చిలుక మల్లిక, ఇరుగురాల సుమలత, బొంకూరి నిర్మల,కుక్క విజయ,తుంగపిండి సుకన్య,తదితరులు పాల్గొన్నారు.



### సాగునీరు, ఎరువుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా

# ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది

- ◆ ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు
- ◆ రైతులకు శాస్త్రీయ సాగు విధానాలపై విస్తృత అవగాహన కల్పించాలి
- ◆ ఎస్సారెస్పీ కాలువలకు వెంటనే బుష్ క్లియరెన్స్ పనులు చేపట్టాలి




**పెద్దపల్లి/సుల్తానాబాద్,ఆగస్టు 05(జనంసాక్షి) :** రైతులకు సాగునీరు, ఎరువుల సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు అన్నారు. బుధవారం సుల్తానాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ రైతులు అవసరానికి మించి యూరియా, డీఏపీ ఎరువులను వినియోగించడం వల్ల భూముల సారవంతత క్రమంగా తగ్గిపోతుందని అన్నారు. గతంలో ఎకరానికి అర బస్తా యూరియా కూడా వినియోగించేవారు కాదని, ప్రస్తుతం అధిక దిగుబడుల ఆశతో విచక్షణారహితంగా ఎరువులు వాడడం భవిష్యత్తులో ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తుందని తెలిపారు. గ్రామాల్లో సర్పంచులు,వ్యవసాయ అధికారులు రైతులకు సమతుల్య ఎరువుల వినియోగం, భూసార పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

- సేంద్రియ వ్యవసాయం - శాస్త్రీయ సాగుకు ప్రాధాన్యం

సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతులు మరింతగా అనుసరించాలని ప్రభుత్వ విప్ కోరారు. త్వరలోనే కాలువల్లో నీటి విడుదల ప్రస్తుతం కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ ఎస్సారెస్పీకి నీరు క్రమంగా చేరుతోందని తెలిపారు. మహారాష్ట్రలోని ప్రాజెక్టులు ఇప్పటికే 80 శాతానికి పైగా నిండాయని, తెలంగాణకు సాగునీటి విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే ఎస్సారెస్పీ కాలువల్లో నీటి విడుదల జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందేలా తాను ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలువల బుష్ క్లియరెన్స్ వెంటనే పూర్తి చేయాలి ఎస్సారెస్పీ ప్రధాన, ఉప కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా అన్ని కాలువలకు వెంటనే బుష్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి విడుదలకు ముందే కాలువలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. రైతులకు ఎల్లప్పుడూ ప్రభుత్వం అండగా ఉంటుంది రాబోయే యాసంగి సీజన్‌కు కూడా సమృద్ధిగా సాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ఎస్సారెస్పీ ప్రధాన, ఉప కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా వెంటనే బుష్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువల శుభ్రత పనులపై సాగునీటి శాఖ అధికారులతో తక్షణమే సమన్వయ సమావేశం నిర్వహించి, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. నీటి విడుదలకు ముందే అన్ని కాలువలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి రైతులకు సాగునీరు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లాలో ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటే వెంటనే వాటిని మార్చాలని, రైతులు, గృహ వినియోగదారులు, పరిశ్రమలకు



నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందేలా విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రకాష్ రావు, ఎంపీడీవో దివ్య దర్శన్ రావు, తహసిల్దార్ బషీరుద్దీన్, డి.ఎల్.పి.ఓ.దేవకీదేవి, మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు సింగిల్ విండో చైర్మన్లు, మండల స్థాయి అధికారులు సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగట్టు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా కోరెం శ్రీధర్ రెడ్డి

**శంకరపట్నం ఆగస్టు 5 జనంసాక్షి**

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా కోరెం శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రామగిరి ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా మంజుల లచ్చయ్య, కార్యదర్శులుగా జానపట్ల రాజు, రామగిరి రాబిన్‌లను ఎంపిక చేశారు. అలాగే గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తీగల సాయి, ఉపాధ్యక్షుడిగా మంజుల శ్రీనివాస్, కోశాధికారిగా రామగిరి సుధాకర్‌ను ఎన్నుకున్నట్లు కొత్తగట్టు ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, నూతన గ్రామ శాఖ కమిటీ నాయకత్వంలో గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో కమిటీ సభ్యులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన గ్రామ శాఖ అధ్యక్షుడు కోరెం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామస్తులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, మండల నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా గ్రామంలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు సమిష్టిగా పనిచేస్తామని పేర్కొన్నారు.

# సతుల పదవులకు పతుల పెత్తనం..!

### పేరుకే మహిళా ప్రజాప్రతినిధులు.. అధికారమంతా భర్తల చేతుల్లోనేనా?

**గంభీరావుపేట ఆగస్టు 05 జనం సాక్షి;**

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పించినప్పటికీ, గంభీరావుపేట మండలంలో పలుచోట్ల మహిళా సర్పంచుల స్థానంలో వారి భర్తలే వ్యవహారాలు నడుపుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఎన్నికల్లో గెలిచి ప్రమాణ స్వీకారం చేసిన మహిళా సర్పంచులకు బదులుగా, పంచాయతీ కార్యాలయాల్లో వారి వ్యక్తిగత ఫోన్ నంబర్ల స్థానంలో భర్తల ఫోన్ నంబర్లే అందుబాటులో ఉండటం చర్చనీయాంశంగా మారింది. ప్రజలు సమస్యలపై ఫోన్ చేసినా మహిళా సర్పంచులతో కాకుండా వారి భర్తలతోనే మాట్లాడాల్సిన పరిస్థితి నెలకొందని స్థానికులు అంటున్నారు.మహిళలు రాజ్యాంగబద్ధంగా ఎన్నికై బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ, అధికార యంత్రాంగం కూడా పలుచోట్ల భర్తలకే ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మహిళా ప్రజాప్రతినిధుల అధికారాలను గౌరవించి వారితోనే అధికారికంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.మహిళా సర్పంచులకే అధికారిక గుర్తింపు, ప్రాధాన్యత కల్పిస్తూ వారి వ్యక్తిగత సంప్రదింపు వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, భర్తల జోక్యాన్ని నియంత్రించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.







## నవోదయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**చొప్పదండి, ఆగస్టు 5 (జనంసాక్షి):**

చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో అంద జేస్తున్న విద్యాసేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకాడే పిలుపునిచ్చారు .చొప్పదండిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో విద్యాలయ ప్రిన్సిపల్ బ్రహ్మానంద రెడ్డి ఆధ్వర్యంలో నవోదయ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే (ఎఐా) ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు జవహర్ నవోదయ విద్యాలయంతో ఉన్న అనుబంధాన్ని (తాను సోలాపూర్ ఏఔఎ పూర్వ విద్యార్థిని అని గుర్తుచేసుకుంటూ) పంచుకున్నారు. విద్యార్థులు మంచి విద్యను అభ్యసించాలని, ఏఔఎ కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచిస్తూ స్ఫూర్తిని నింపారు. చొప్పదండి మండలానికి చెందిన పలువురు ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా అధికారులు రాజీవ్ గాంధీ మరియు పి.వి. నరసింహారావు చిత్రపటాలకు నివాళులర్పించారు. అఖఇ 10 మరియు 12వ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలు అందజేసి సత్కరించారు. ఈ వేడుకల్లో ఎంపీ ప్రతినిధి ఎన్. నరోత్తం రెడ్డి, చొప్పదండి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మాజీ జెడ్పిటిసి ఇప్పెనపల్లి సాంబయ్య మాజీ ఎంపీపీ వల్లాల కృష్ణ హరి పూర్వ విద్యార్థులు, ఖఅ సభ్యులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బావిలో పడి మహిళ మృతి

జక్రాన్‌పల్లి మండలం



లక్ష్మాపూర్ తండాకు చెందిన నూనావత్ పీరు (45) ఈ రోజు ఉదయం 9:30 గంటల సమయంలో మేకలు మేపేందుకు వెళ్లి, లక్ష్మాపూర్ తండాలోని గడ్డం నర్సారెడ్డి వ్యవసాయ బావి వద్ద ప్రమాదవశాత్తు జారి బావిలో పడిపోయింది. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, గ్రామస్థుల సహాయంతో బయటకు తీశారు. అయితే అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి కుమారుడు నూనావత్ యుగేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గాంధారి ఏకలవ్య గురుకులంలో యూనిఫాంల కుట్టింపు కోసం దరఖాస్తుల ఆహ్వానం

**ఆగస్టు 7 వరకు దరఖాస్తుల స్వీకరణ : జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్**

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 5( జనం సాక్షి)

కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించేందుకు ఆసక్తి గల టైలర్లు, టైలరింగ్ సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ తెలిపారు.కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన నమూనా ప్రకారం విద్యార్థుల యూనిఫాంల కోసం అవసరమైన వస్త్రం (క్లాత్) సిద్ధంగా ఉందని, అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు నిబంధనల మేరకు ఈ నెల 7వ తేదీలోపు తమ దరఖాస్తులను సమర్పించాలని సూచించారు.దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు గాంధారి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల టైలర్లు, సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన

**బోయినపల్లి, ఆగస్టు 05 (జనం సాక్షి)**

సురక్ష తిరంగా కార్యక్రమంలో భాగంగా బోయినపల్లి ఎస్ఐ ఎన్. రమాకాంత్ బుధవారం బోయినపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎవరికీ వెల్లడించవద్దని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడంతో పాటు అనుమానాస్పద లింకులు, సందేశాలను తెరవకూడదని వివరించారు. సైబర్ నేరాల బారిన పడినట్లయితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసి, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్పంచ్ భర్త ఆత్మహత్యా యత్నం

**గంగాధర ఆగస్టు 05(జనంసాక్షి )**

మండలంలోని నారాయణపూర్ గ్రామంలో తీవ్ర కలకలం రేగింది గ్రామ సర్పంచ్ ధీకొండ బాబాలక్ష్మీ భర్త దీకొండ మధు బుధవారం ఆత్మహత్యా ప్రయత్నానికి పాల్పడ్డాడు.కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ లోని వన్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆసుపత్రికి వెళ్ళి ఐసీయూలో చికిత్స పొందుతున్న మధును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.బాధితుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

◆ **మెట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లోసైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన**

◆ **భయపెట్టి ఆశపెట్టి మోసగాళ్లు ఉచ్చులోకి లాగుతారని ఎస్ఐ కే. శేఖర్ రెడ్డి హెచ్చరిక**

**శంకరపట్నం ఆగస్టు5 జనంసాక్షి**

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేశవపట్నం ఎస్ఐ కే.శేఖర్ రెడ్డి సూచించారు. బుధవారం మెట్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పద్ధతులు, వాటి నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, సందేశాలు, సోషల్ మీడియా, నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ముందుగా భారీ బహుమతులు, ఉద్యోగాలు, పెట్టుబడులపై అధిక లాభాలు వంటి ఆశలు చూపించడం లేదా బ్యాంకు ఖాతా బ్లాక్ అవుతుందని, కేసులు నమోదయ్యాయని, కేవైసీ అప్‌డేట్ చేయాలని భయపెట్టడం ద్వారా వారి ఆలోచనలను ప్రభావితం చేసి చివరకు బ్యాంకు ఖాతాల్లోని డబ్బును కాజేస్తారని హెచ్చరించారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్ చేయవద్దని, అనుమానాస్పద ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, ఏటీఎం పిన్, ఆధార్, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పవద్దని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా సందేశం వచ్చినప్పుడు వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

"ఆశ చూపిస్తారు? భయం పెడతారు? చివరికి మీ డబ్బే లక్ష్యం. ఆశపడితే నష్టపోతారు? కష్టపడితేనే ఫలితం వస్తుంది? ఊరికే ఏదీ రాదు" అనే సందేశాన్ని విద్యార్థులకు అందిస్తూ, అప్రమత్తతే సైబర్ నేరాల నుంచి రక్షణకు ప్రధాన ఆయుధమని ఎస్ఐ కే. శేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలందరూ జాగ్రత్తగా వ్యవహరించి సైబర్ మోసాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

- ◆ వైద్యులు, సిబ్బంది సమయపాలన కచ్చితంగాపాటించాలి
- ◆ ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ, ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- ◆ ప్రతి గర్భిణిని క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేయాలి
- ◆సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**సుల్తానాబాద్,ఆగస్టు 05(జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, వైద్య సేవలు సకాలంలో,అందేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ (అవుట్ పేషెంట్లు) సంఖ్య పెరిగేలా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణులందరినీ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సమన్వయంతో క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేస్తూ అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులను ప్రత్యేకంగా గుర్తించి నిరంతర పర్యవేక్షణలో ఉంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వార్డులు, మరుగుదొడ్లు, ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులు, వైద్య పరీక్షలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి సంతృప్తి చెందేలా సేవలు అందించాలని, రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, రిఫరల్స్‌ను తగ్గిస్తూ సాధ్యమైనంత మేరకు స్థానికంగానే నాణ్యమైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచే విధంగా ప్రతి ఉద్యోగి సేవాభావంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సంబంధిత వైద్యాధికారులు, ఆసుపత్రి సిబ్బంది ,పాల్గొన్నారు.

# దోమల నివారణకు ప్రత్యేక చర్యలు. కౌన్సిలర్ భాకం సాయికిరణ్

## - ఆరవ వార్డులో ఫాగింగ్ స్ప్రే

**సుల్తానాబాద్,ఆగస్టు 05(జనంసాక్షి) :** ఆరవ వార్డులో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వార్డు కౌన్సిలర్ భాకంసాయికిరణ్ స్పష్టం చేశారు. బుధవారం అరవ వార్డులో ఫా గింగ్ స్ప్రే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భాకం సాయి కిరణ్ ఆరోవ వార్డులో పర్యటించి ప్రజల నుండి వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలుసమస్యలపై ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాతరి దేవేందర్, ఆరేపల్లి కిరణ్,ఆరెపల్లి హేమన్ రాజు,న్యాతరి దుర్గయ్య, మామిడిపల్లి శ్రీకాంత్,వినయ్, ప్రణయ్,స్టాలిన్,ఆది తోపాటు తదితరులు పాల్గొన్నారు.



# మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి భూమి పూజ

**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 05, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గుండారం గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించనున్న మహిళా సమఖ్య భవన నిర్మాణానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ భూమి పూజ చేశారు. రాచర్ల గుండారం గ్రామపంచాయితీ ఆవరణలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ సాబేర బేగంతో కలిసి కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని 30 మహిళా సంఘాలకు ఉపయోగపడే పది లక్షల రూపాయాల వ్యయంతో నిర్మించ తలపెట్టిన మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి మహిళా సంఘాలతో పూజా కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామంలోని 30 మహిళా సంఘాలకు ఈ భవనం సేవలందించనుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సుడిది రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మటి నర్సయ్య, జిల్లా కార్యదర్శి గిరిధర్ రెడ్డి, కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు మర్రి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్‌రెడ్డి, మాజీ మైనారిటీ సెల్ అధ్యక్షులు సాహెబ్, షేక్ గౌస్, గంభీరావుపేట మండల అధ్యక్షుడు తిరుపతి గౌడ్‌లు పాల్గొన్నారు.



# ప్రజ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

## - మిషన్ భగీరథ పనుల్లో నిర్లక్ష్యం సహించేది లేదు.

## తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి

## - విద్య, వైద్యం, సాగునీటికి ప్రాధాన్యం

## - సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావు,కలెక్టర్ కోయ శ్రీహర్ష

సుల్తానాబాద్,ఆగస్టు 05(జనంసాక్షి) : మండల ప్రజలకు మిషన్ భగీరథ త్రాగునీటి సరఫరా లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని, విద్యా వైద్యం సాగునీరు కు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు స్పష్టం చేశారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో దివ్యదర్శన్ రావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాని కి,ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని వివిధ శాఖల పనితీరును విపులంగా,సమీక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామాల అభివృద్ధి, తాగునీరు, సాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో వివిధ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న మంచినీటి సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.



# ఈనెల 20,న సుల్తానాబాద్ లో జరిగే ఏఐటీయూసీ పెద్దపలి జిల్లా 4వ మహాసభను జయప్రదం చేయండి

## - ఉద్యోగ. కార్మిక వర్గానికి ఏఐటీయూసీ డిస్ట్రిక్ట్ ప్రెసిడెంట్ వైవి రావు జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ పిలుపు

**సుల్తానాబాద్, ఆగస్టు 05 (జనంసాక్షి) :** ఏఐటీయూసీ పెద్దపెల్లి జిల్లా నాలుగవ మహాసభలను సుల్తానాబాద్ మండల కేంద్రంలో ఈ నెల 20 న, యశోద నరహరి ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వైవి రావు జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ తెలిపారు. ఈ మహాసభకు సిపిఐ జాతీయ నాయకులు ఉమ్మడి రాష్ట్రాల శాసనసభ ఫ్లోర్ లీడర్ కామ్రేడ్ చాడ వెంకట్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ కలవేన శంకర్ ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఎస్ బాలరాజు సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హాజరు అవుతున్నారు. ఈ మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించుకోవడానికి మహాసభలో కార్మిక ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన ఉద్యమ రూప కల్పన జరుగుతుందన్నారు . ఈ మహాసభకు ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు మధ్యాహ్న భోజనం ఆశ అంగన్వాడి హమాలి ఐకెపి రైస్ మిల్ గోదాం రైల్వే పోస్టల్ ఎల్ఐసి ఎన్టిపిసి ఆర్టీ సీ సివిల్ సప్లై సంఘటిత అసంఘటిత కార్మిక వర్గం హాజరుకావాలని 20,న 10 గంటలకు సుల్తానాబాద్ ఐబి నుండి మహాసభ ప్రాంగణం వరకు జరుగుతుందని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.




# సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

## సిఐ వెంకటేష్

**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 05, (జనంసాక్షి) :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్-ఎస్ యూనిట్, పోలీసు శాఖ సంయుక్త ఆ ధ ్వ ర ్య ం లో విద్యార్థులకు సైబర్ క్రైమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని ఫోన్ కాల్స్, నకిలీ వెబ్ సైట్లు, ఓటిపిలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ నేరాలకు ఎవరైనా గురైనట్లయితే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, సమీప పోలీస్ స్టేసన్‌ను సంప్రదించాలని సిఐ వెంకటేష్ సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరగి పొందే అవకాశాలు మెరుగుపడతాయని ఆయన వివరించారు. అదేవిధంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సమాజంలోని ఇతరులకు కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యాభ్యాసంపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు డిజిటల్ ప్రపంచంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, సైబర్ భద్రతపై అవగాహన కలిగి ఉండటం నేటి అవసరమని పేర్కొన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల్లో చైత్యనం, అప్రమత్తత, సామాజిక బాధ్యతను పెంపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేష్, ఎస్ఐ సర్సింహులు, కళాశాల ఇంచార్జి కె. సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి వాసరవేణి పర్శరాములు, అధ్యాపకులు మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, బుట్ట కవిత, నీరటి విష్ణుప్రసాద్ , జ్యాతోతు శ్రీనివాస్, గజ్జెల గంగాధర్, అనుముల రవిచంద్ర, వెల్దండి సౌమ్య, అగోలం, గౌతమీ, బోధనేతర సిబ్బంది విమల్ కుమార్, కనమేని దేవేందర్, షాహినా సుల్తానా, నిఖిల్, పోలీసు శాఖ సిబ్బంది, ఎన్ఎస్ ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : కలెక్టర్ కోయ శ్రీహర్ష

**- వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి**

**- సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**పెద్దపల్లి/సుల్తానాబాద్,ఆగస్టు 05(జనంసాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.బుధవారం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి ఆకస్మికంగా తనిఖీ చేసి ఆసుపత్రిలోని ఓపీ విభాగం, వార్డులు, ప్రసూతి విభాగం, ల్యాబ్, ఫార్మసీ, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి వైద్యాధికారులు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది విధి నిర్వహణలో సమయపాలన పాటిస్తూ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని ఆదేశించారు.ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ (అవుట్ పేషెంట్లు) సంఖ్య పెరిగేలా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. గర్భిణులందరినీ ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సమన్వయంతో క్రమం తప్పకుండా ఫాలోఅప్ చేస్తూ అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులను ప్రత్యేకంగా గుర్తించి నిరంతర పర్యవేక్షణలో ఉంచి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.ఆసుపత్రిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వార్డులు, మరుగుదొడ్లు, ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులు, వైద్య పరీక్షలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి సంతృప్తి చెందేలా సేవలు అందించాలని, రోగుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, రిఫరల్స్‌ను తగ్గిస్తూ సాధ్యమైనంత మేరకు స్థానికంగానే నాణ్యమైన చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.





ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల నమ్మకాన్ని మరింత పెంచే విధంగా ప్రతి ఉద్యోగి సేవాభావంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ తనిఖీలో సంబంధిత వైద్యాధికారులు,ఆసుపత్రి సిబ్బంది ,పాల్గొన్నారు.



## కాసులపల్లి లో సీజనల్ వ్యాధుల పై నివారణ చర్యలు

**పెద్దపల్లి,ఆగస్టు 05(జనంసాక్షి) :**

పెద్దపల్లి మండలం కాసులపల్లి గ్రామంలో బుధవారం వర్ష కాల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ గద్దెల రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామంలోని పలు వార్డుల్లో రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ముళ్లపొదలకు మందు పిచికారీ చేయించారు. గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, సీజనల్ వ్యాధుల నివారణకు కృషి తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో డస్ట్ పిన్ విధానంపై గోడలపై పెయింటింగ్ తో సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గం ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోటో 05 పెద్దపల్లి 06

## పెద్దపల్లి ప్రభుత్వ ఐటిఐ లో మెగా అప్రెంటిషిప్, అండ్ జాబ్ మేళా కార్యక్రమం

పెద్దపల్లి,ఆగస్టు 05(జనంసాక్షి) : పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఐ. టి. ఐ. లో బుధవారం మెగా అప్రింటీస్ షిప్ మరియు జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి 528 మంది విద్యార్థి విద్యార్థినులు హాజరు కాగా ఇందులో 364 మంది ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమానికి ఎల్ అండ్ టి కన్స్ట్రక్షన్స్,జాన్ లిఫ్ట్ ఆటోమేటీవీ మనుఫక్చర్స్ ఆదర్శ ఆటోమోటివ్, సిడబ్ల్యూఏసి ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, సచ్చిదారు ఎలక్ట్రికల్స్,ఎన్ ఆర్ బి బేరింగ్స్, ఆజాద్ ఇంజనీరింగ్ వర్క్స్, జిఎంఆర్ ఫౌండేషన్ టీవీఎస్ హెల్మెట్స్, రెడ్డి ఫౌండేషన్,తదితర కంపెనీలు హాజరు అయినాయని.అన్ని కంపెనీలు ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక అయిన వారికి నియామక పత్రాలు అందించారు.ఈ కార్యక్రమం లో బుసిరెడ్డి వెంకట్ రెడ్డి , ప్రిన్సిపల్ /కన్వీనర్ మరియు ప్రభుత్వ ఐ. టి. ఐ. పెద్దపల్లి స్టాఫ్ ఆద్వర్యం లో విజయవంతంగా పూర్తి అయిందని తెలిపారు.



## పెద్దపల్లిలో ఘనంగా "నషా ముక్త యువ - వికసిత్ భారత్ ఏ2047" కార్యక్రమం

**పెద్దపల్లి,ఆగస్టు 05(జనంసాక్షి) :**

యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడి, ఆరోగ్యవంతమైన,బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దేందుకు మేరా యువ భారత్, పెద్దపల్లి ఆధ్వర్యంలో "నషా ముక్త యువ-వికసిత్ భారత్ ఏ2047" కార్యక్రమాన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. జై కిషన్ ఓజా, రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి. రాజేశ్వర్ రావు, షీ టీమ్ ఇన్చార్జ్ ఎస్.ఐ. ఎం. లావణ్య, ఎస్.ఐ. జి. హరి శంకర్, ఎక్సైజ్ ఎస్.ఐ. ఎం. శ్రీనివాస్, జిల్లా యువజన అధికారి జి. తిరుపతి రెడ్డి, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి డా. మనోహర్, 9వ బెటాలియన్ సుబేదార్ రమేష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,యువత మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజం,దేశ అభివృద్ధికి కూడా తీవ్ర ప్రమాదమని పేర్కొన్నారు. యువత తమ శక్తి, సామర్థ్యాలను విద్య, క్రీడలు, సేవా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి వైపు మళ్లించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో భాగంగా నృత్యం, సంగీతం,పెయింటింగ్, వక్తృత్వం, నినాద రచన, నుక్కడ్ నాటక్, స్లామ్ పోయెట్రీ, రీల్ ఉ షార్ట్ ఫిల్మ్ వంటి 8 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. విద్యార్థులు మత్తు పదార్థాల దుష్పరిణామాలను తమ ప్రతిభ ద్వారా అద్భుతంగా ఆవిష్కరించారు.విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయగా, ప్రథమ స్థానం సాధించిన వారు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు.అనంతరం అందరితో "నషా ముక్త భారత్" ప్రతిజ్ఞ చేయించి,మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ సమాజంలో అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు.రేషేవాణి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది వాలంటీర్లు, విద్యార్థులు,అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం యువతలో మత్తు పదార్థాలపై అవగాహన పెంపొందించడమే కాకుండా, వారి సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను వెలికితీసే ఒక ఉపయోగకరమైన,స్ఫూర్తిదాయకమైన సామాజిక కార్యక్రమంగా నిలిచిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న "నషా ముక్త భారత్-వికసిత్ భారత్ ఏ2047" సాధనలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

## నేటినుండి యధావిధిగా మంచినీటి సరఫరా

**- మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ**

**సుల్తానాబాద్,ఆగస్టు 05(జనంసాక్షి) :**

నేటి నుండి మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులకు మంచినీటి సరఫరా యధావిధిగా వస్తుందని మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మున్సిపల్ కమిషనర్ టి రమేష్ తెలిపారు. బుధవారం నూతన అమృత్ పైప్ లైన్ నిర్మాణంలో భాగంగా,పాత పైపులైన్ లీకేజీ ,ధ్వంసం, కావడంతో గత రెండు రోజులు మంచినీటి సరఫరా లో అంతరాయం కలిగిందన్నారు.ఇకనుండి ప్రతిరోజు యధావిధిగా అన్ని వార్డులలో మంచినీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఉట్ల వర ప్రదీప్, కందునూరి సమత కుమార్,తొగ్గరి కొండ ప్రభాకర్,తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ ఆటోమోటివ్స్‌లో టీఎన్జీఓ అధ్యక్షుడు శంకర్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభోత్సవం



**పెద్దపల్లి,ఆగస్టు 08(జనంసాక్షి) :**

పెద్దపల్లి కలెక్టరేట్ సమీపంలోని ఆదర్శ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం మారుతి సుజుకి అరేనా నూతన బ్రెజ్జా వాహనాన్ని ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి టీ.ఎన్.జీ.ఓస్ జిల్లా అధ్యక్షులు, ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ బొంకూరి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూతన బ్రెజ్జా వాహనాన్ని ఆవిష్కరించి అధికారికంగా మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆదర్శ ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ శ్రీ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ, వినియోగదారులకు అత్యుత్తమ నాణ్యత కలిగిన వాహనాలు, పారదర్శక సేవలు మరియు విశ్వసనీయమైన అమ్మకాల అనంతర సేవలను అందించడమే సంస్థ లక్ష్యమని తెలిపారు. పెద్దపల్లి ప్రజలు సంస్థపై చూపుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ గౌడ్ మాట్లాడుతూ, మారుతి సుజుకి బ్రెజ్జా అత్యాధునిక సాంకేతికత, అత్యున్నత భద్రతా ప్రమాణాలు, ఆకర్షణీయమైన డిజైన్, మెరుగైన పనితీరుతో వినియోగదారుల అంచనాలను అందుకుంటుందని తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన సేవలను అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. ముఖ్య అతిథి బొంకూరి శంకర్ మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో ఆదర్శ ఆటోమోటివ్స్ వినియోగదారుల విశ్వాసాన్ని సంపాదించుకుని నాణ్యమైన సేవలు అందిస్తూ ముందంజలో ఉందని కొనియాడారు. సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మధు, సేల్స్ మేనేజర్ భరత్ కుమార్, టీఎన్జీఓ సంఘ భాద్యులు కొమురయ్య, శ్రీనివాస్,ప్రవీణ్,గంగా రెడ్డి,రమేష్,శ్రీనివాస్, నిశాంత్ రావు,కార్యవర్గ సభ్యులు ప్రేమ్ సాగర్,రవి,యు శ్రీనివాస్, అఖిల్,శ్యామ్, చంద్రశేఖర్,శ్రీనివాస్,ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని నూతన బ్రెజ్జా వాహన ఆవిష్కరణను విజయవంతం చేశారు.